RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | గురువారం, అక్టోబరు 29, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 171 | పేజీలు: 8 | వెల : రూ.1

102 ఉద్యోగాలకు టీజీపీఎస్సీ నుంచి కొత్త నోటిఫికేషన్

మియాపూర్ భూములు

ప్రభుత్వానివే!

తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా సర్వోన్నత న్యాయస్థానం తీర్పు

సర్వే నం.100, 101లోని భూములపై ప్రైవేటు వ్యక్తుల అప్పీళ్లు కొట్టివేత

2003లో ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించిన ధర్మాసనం

1912 నాటి రెవెన్యూ రికార్డులకు ప్రాధాన్యం

జాగీర్ హక్కులు ఉన్నంత మాత్రాన భూమిపై యాజమాన్య హక్కులు రావని స్పష్టీకరణ

వేల కోట్ల రూపాయల విలువైన భూములకు న్యాయపరమైన రక్షణ

హైదరాబాద్: మియాపూర్ భూముల వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో కీలక విజయం లభించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ పరిధిలోని సర్వే నంబర్లు 100, 101లో ఉన్న సుమారు 550 ఎకరాలకు పైగా భూములపై ప్రైవేటు వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఈ భూ వివాదంలో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువడింది. హైదరాబాద్ పరిసరాల్లో అత్యంత విలువైన భూములకు సంబంధించిన ఈ కేసు తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ఈ అప్పీళ్లను విచారించింది. 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ప్రైవేటు వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని భావించిన ధర్మాసనం వారి అప్పీళ్లను తోసిపుచ్చింది. దీంతో వివాదాస్పద భూములపై

- మిగతా 2వ పేజీలో

తెలంగాణ పెట్టుబడులే లక్ష్యం!

ఢిల్లీలో 'ఇన్వెస్ట్ తెలంగాణ' సన్నాహక సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యాచరణ

డిసెంబరు 7 - 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్

పారిశ్రామిక అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పనపై దృష్టి

రాష్ట్రంలోని మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలకు ప్రాధాన్యం

ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం

దేశీయ, విదేశీ పారిశ్రామికవేత్తలతో భాగస్వామ్యాలే లక్ష్యం

న్యూఢిల్లీ: తెలంగాణను దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి గురువారం ఢిల్లీలో నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026' సన్నాహక కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలు, మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రభుత్వం అందించనున్న సహకారాన్ని పెట్టుబడిదారులకు వివరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

తెలంగాణలో పెట్టుబడులను పెంచడం ద్వారా పారిశ్రామిక రంగాన్ని విస్తరించడంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడం, ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలు తమ వ్యాపారాలను విస్తరించేలా ప్రోత్సహించడం, అంతర్జాతీయ సంస్థలతో వ్యాపార భాగస్వామ్యాలను బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. ఢిల్లీలో నిర్వహించిన సన్నాహక కార్యక్రమం ద్వారా ఈ లక్ష్యాలను పారిశ్రామికవేత్తలకు వివరించే ప్రయత్నం చేసింది.

డిసెంబరులో ప్రధాన సదస్సు

హైదరాబాద్ సమీపంలోని భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 7, 8, 9 తేదీల్లో మూడు రోజులపాటు ప్రధాన గ్లోబల్ సమ్మిట్ జరగనుంది. ఈ సదస్సులో దేశీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ రంగాల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొననున్నారు. పరిశ్రమల అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాలు, వ్యాపార విస్తరణకు సంబంధించిన అంశాలపై చర్చలు జరగనున్నాయి.

పెట్టుబడిదారులు తెలంగాణలో కొత్త ప్రాజెక్టులను ప్రారంభించేందుకు అవసరమైన అనుమతులు, ప్రభుత్వ విధానాలు, మౌలిక సదుపాయాలు, ఇతర అవకాశాలపై ఈ సదస్సు ద్వారా అవగాహన కల్పించనున్నారు. పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తూ, పెట్టుబడుల ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

రక్షణ రంగంపైనా ప్రత్యేక దృష్టి

గ్లోబల్ సమ్మిట్‌తోపాటు ఏరోస్పేస్, రక్షణ రంగాలకు సంబంధించిన ఎక్స్‌పో నిర్వహణకు కూడా ప్రణాళికలు రూపొందించారు. రక్షణ పరికరాల తయారీ,

- మిగతా 2వ పేజీలో

కరవు నిర్వహణలో చంద్రబాబు భేష్!

ఏపీలో తెలంగాణ కంటే ఎక్కువ వర్షపాతం లోటు

ముందుచూపుతో నీటిని ఒడిసిపట్టిన చంద్రబాబు

కరవు నిర్వహణలో ఏపీ ప్రభుత్వ పనితీరుకు అభినందనలు

తెలంగాణలో కరవు పరిస్థితులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీత

పంటల సాగుకు ఇబ్బందులపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీఆర్ఎస్ నేత కేటీఆర్

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. కరవు పరిస్థితులను ఎదుర్కోవడంలో చంద్రబాబు వ్యవహరించిన తీరును అభినందించారు. తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్‌లో వర్షపాతం లోటు ఎక్కువగా ఉన్నప్పటికీ.. ముందస్తు ప్రణాళికతో నీటిని సమర్థంగా వినియోగించుకున్నారని పేర్కొన్నారు. అదే సమయంలో తెలంగాణలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.

తెలంగాణ భవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. పక్క రాష్ట్రాల్లో లేని కరవు తెలంగాణలోనే ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ముందుచూపుతో నీటిని సమర్థంగా వినియోగించుకునే చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. కరవు నిర్వహణలో ఆయన అనుసరించిన విధానాన్ని అభినందిస్తున్నానని చెప్పారు. తెలంగాణలోనూ ఇలాంటి ముందస్తు ప్రణాళిక, సమర్థమైన నీటి నిర్వహణ అవసరమని అభిప్రాయపడ్డారు.

తెలంగాణలో వర్షపాతం లోటు ఉన్నప్పటికీ కరవు పరిస్థితులు ఏర్పడటానికి ప్రభుత్వ ముందస్తు చర్యల లోపమే కారణమని కేటీఆర్ విమర్శించారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో వ్యవసాయ రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సాగునీటి లభ్యత, పంటల సాగు, రైతుల సమస్యలపై ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ.. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు భరోసా కల్పించాల్సిన సమయంలో ప్రభుత్వం ఇతర అంశాలకు ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే

- మిగతా 2వ పేజీలో

నేను అప్పుడు అలా మాట్లాడాల్సింది కాదు..

కేటీఆర్‌కు సారీ చెప్పిన కొండా సురేఖ

గతంలో చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటన

రేవంత్ రెడ్డి క్యాబినెట్ నుంచి తొలగించిన తర్వాత ఈ పరిణామం

కొండా దంపతులు తిరిగి బీఆర్ఎస్‌లో చేరతారనే ఊహాగానాలకు బలం

2లో

102 ఉద్యోగాలకు టీజీపీఎస్సీ నుంచి కొత్త నోటిఫికేషన్

తెలంగాణలో 102 స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

స్టాటిస్టిక్స్ డిగ్రీ ఉన్నవారికి సువర్ణావకాశం

అక్టోబర్ 30 నుంచి నవంబర్ 27 వరకు దరఖాస్తుల స్వీకరణ

ఎంపికైన వారికి 1.06 లక్షల వరకు వేతనం

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఆర్థిక, గణాంక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 102 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది. వీటిలో మండల ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎంపీఎస్ఓ), డైరెక్టరేట్ ఆఫ్

- మిగతా 2వ పేజీలో

ఇక కబ్జా కుదరదు

ఆర్.కె.పురం చెరువుకు 'హైడ్రా' కంచె

ఆర్.కె.పురం చెరువులో 12 ఎకరాల ఆక్రమణల తొలగింపు

భవిష్యత్తులో కబ్జాలకు ఆస్కారం లేకుండా ఫెన్సింగ్ ఏర్పాటు

స్థానికుల ఫిర్యాదులతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు

అక్రమ పందుల వధశాలలు, ప్రీకాస్ట్ గోడల కూల్చివేత

చెరువు ఎఫ్‌టీఎల్ భూమి అని సూచిస్తూ బోర్డుల ఏర్పాటు

హైదరాబాద్‌లోని ఆర్.కె.పురం చెరువు ఆక్రమణల పర్వానికి హైడ్రా (HYDRAA) గురువారం శాశ్వత అడ్డుకట్ట వేసింది. భవిష్యత్తులో మళ్లీ కబ్జాలకు ఆస్కారం లేకుండా చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలో పటిష్ఠమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఆక్రమణల సమస్యకు ఈ చర్యతో పరిష్కారం లభించినట్లయింది.

ఈ కార్యక్రమానికి ముందు, చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు తొలగించారు. కొందరు వ్యక్తులు ప్రీకాస్ట్ గోడలు, కంచెలు వేసుకుని తమ ఆధీనంలోకి తీసుకున్న భూములను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా ఏర్పాటు చేసిన పందుల వధశాలలను (కబేళాలను) కూడా కూల్చివేసి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. స్థానికంగా మినీ ట్యాంక్‌బండ్‌గా పేరుగాంచిన ఆర్.కె.పురం చెరువు (ముక్కిడికుంట) కొంతకాలంగా

- మిగతా 2వ పేజీలో

మార్చి నాటికి భారత్‌లో ఎండలతో

55,000 మరణాలు?

ఎల్‌నినోపై కొత్త అంచనా!

మార్చిలోనే ఎక్కువ మరణాలు సంభవించే అవకాశం ఉందని వెల్లడి

ప్రపంచవ్యాప్తంగా 3.73 లక్షల మరణాల అంచనా

నైజీరియాలో 56 వేల మరణాల ప్రమాదం ఉందన్న క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్

ఎల్‌నినో ప్రభావం 2027 ప్రారంభం వరకు కొనసాగే అవకాశం

2లో

ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై

చర్యలు తప్పవు

టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

బిల్లుల కోసం చావడానికి కూడా సిద్ధమేనన్న అనిరుధ్ రెడ్డి

అనిరుధ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామన్న మహేశ్ గౌడ్

నిధుల కొరత రాష్ట్రవ్యాప్తంగా ఉందన్న పీసీసీ చీఫ్

సొంత పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనిరుధ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఈ వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీకి అప్పగిస్తామని ఆయన స్పష్టం చేశారు. అనిరుధ్ రెడ్డికి త్వరలోనే నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని సూచించారు. "జడ్చర్లలో నేను చస్తేనే బిల్లులు వస్తాయంటే... నియోజకవర్గ అభివృద్ధి కోసం చనిపోవడానికైనా సిద్ధం" అని అనిరుధ్ రెడ్డి ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సొంత ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ఉన్న ఈ వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం సీరియస్ గా తీసుకుంది. ఈ వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ స్పందిస్తూ... నిధుల కొరత ఒక్క జడ్చర్లలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉందని, ఇలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఈ అంశాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని తెలిపారు. నవంబర్ 1న ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ ర్యాలీకి కార్యకర్తలను తరలించేందుకు ప్రత్యేక రైళ్ల కోసం దరఖాస్తు చేస్తే, దక్షిణ మధ్య రైల్వే సాకులు చెప్పి తిరస్కరిస్తోందని మహేశ్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పేరు చెబితేనే బీజేపీ వణికిపోతోందని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా తెలంగాణ నుంచి కార్యకర్తలను ఢిల్లీకి తీసుకెళ్లి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మియాపూర్ భూములు

ప్రభుత్వానివే!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ యాజమాన్య హక్కులకు సంబంధించి గతంలో వెలువడిన తీర్పు కొనసాగనుంది. మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 పరిధిలో మొత్తం 550 ఎకరాలకు పైగా భూమి ఉంది. పాత రెవెన్యూ రికార్డుల్లో ఈ భూములను ప్రభుత్వానికి చెందిన 'సర్కారీ పోరంబోకు' భూములుగా పేర్కొన్నట్లు న్యాయస్థానం పరిశీలించింది. భూములపై హక్కులు తమవేనంటూ ప్రైవేటు వ్యక్తులు చేసిన వాదనలను ధర్మాసనం అంగీకరించలేదు.

రెవెన్యూ రికార్డుల్లో ఎవరి పేర్లు నమోదైనంత మాత్రాన భూమిపై యాజమాన్య హక్కులు సంక్రమించవని కోర్టు స్పష్టం చేసింది. సంబంధిత భూముల బదలాయింపునకు చట్టబద్ధమైన ఆధారాలు ఉండాలని పేర్కొంది. కేవలం పహాణీ రికార్డుల్లో పేర్లు ఉన్నాయనే కారణంతో భూమిని సొంతం చేసుకునే హక్కు ఏర్పడదని తెలిపింది. పాత రికార్డులు, భూముల వర్గీకరణ, గతంలో వెలువడిన న్యాయస్థానాల తీర్పులను పరిగణనలోకి తీసుకుంది.

జాగీర్దార్ వారసుల వాదనలు తిరస్కరణ

గతంలో జాగీర్దార్ కైసరుద్దీన్‌కు సంబంధించిన వారసత్వ హక్కుల ఆధారంగా కొందరు వ్యక్తులు ఈ భూములపై హక్కులు కోరారు. తమకు చట్టబద్ధంగా భూములు సంక్రమించాయని, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ), ఇతర పత్రాల ఆధారంగా హక్కులను గుర్తించాలని కోరుతూ న్యాయపోరాటం చేశారు. మరోవైపు, జాగీర్ వ్యవస్థ రద్దయిన తర్వాత సంబంధిత భూములు ప్రభుత్వానికి సంక్రమించాయని తెలంగాణ ప్రభుత్వం వాదించింది. అప్పట్లో జాగీర్దార్‌కు పరిహారం చెల్లించిన నేపథ్యంలో వారసులు తిరిగి యాజమాన్య హక్కులను కోరలేరని ప్రభుత్వ న్యాయవాదులు కోర్టుకు వివరించారు. జాగీర్ హక్కులు ఉన్నంత మాత్రాన భూమిపై పూర్తి యాజమాన్య హక్కులు వచ్చినట్లు కాదని ధర్మాసనం స్పష్టం చేసింది.

2003 తీర్పును సమర్థిస్తూ..

ఈ భూములకు సంబంధించిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ పత్రాల రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తూ గతంలో శేరిలింగంపల్లి మండల తహసీల్దార్ నిర్ణయం తీసుకున్నారు. ఈ చర్యను సవాలు చేస్తూ వివాదం న్యాయస్థానాలకు చేరింది. 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును సవాలు చేస్తూ ప్రైవేటు వ్యక్తులు సుప్రీంకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ కేసులో గతంలో జరిగిన విచారణలు, భూములకు సంబంధించిన పత్రాలు, రెవెన్యూ రికార్డులు, ఇరుపక్షాల వాదనలను సుప్రీంకోర్టు పరిశీలించింది. ప్రభుత్వ భూములపై ప్రైవేటు వ్యక్తులు చేసిన హక్కుల వాదనలకు తగిన ఆధారాలు లేవని ధర్మాసనం అభిప్రాయపడింది. దీంతో హైకోర్టు తీర్పును సమర్థిస్తూ అప్పీళ్లను కొట్టివేసింది.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రాధాన్యం

హైదరాబాద్ ఐటీ కారిడార్‌కు సమీపంలో ఉన్న మియాపూర్ ప్రాంతంలో భూముల విలువ భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో 550 ఎకరాలకు పైగా భూములకు సంబంధించిన వివాదం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత కీలకంగా మారింది. ఈ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా రక్షించేందుకు ప్రభుత్వం తన వాదనలను న్యాయస్థానంలో వినిపించింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులో తాజా తీర్పుతో ప్రభుత్వ భూముల యాజమాన్య హక్కులకు సంబంధించి స్పష్టత ఏర్పడింది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో చారిత్రక రెవెన్యూ రికార్డులు, చట్టబద్ధమైన పత్రాలు, గత న్యాయస్థానాల తీర్పులు ఎంత కీలకమో ఈ వ్యవహారం మరోసారి చాటిచెప్పింది. మియాపూర్ భూములపై కొనసాగిన న్యాయపోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో కీలక ముగింపు లభించింది.

నేను అప్పుడు

అలా మాట్లాడాల్సింది కాదు..

కేటీఆర్‌కు సారీ చెప్పిన కొండా సురేఖ

తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకురాలు కొండా సురేఖ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు క్షమాపణ చెప్పారు. గతంలో ఆయనపై చేసిన వ్యక్తిగత, నిరాధారమైన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఈ పరిణామంతో ఆమె తిరిగి బీఆర్ఎస్‌లో చేరతారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. అప్పట్లో ప్రతిపక్షంపై చేసిన రాజకీయ విమర్శల్లో భాగంగానే ఆ వ్యాఖ్యలు చేశానని, కేటీఆర్‌ను గానీ, ఆయన కుటుంబ సభ్యులను గానీ ఉద్దేశపూర్వకంగా కించపరిచే ఉద్దేశం తనకు లేదని సురేఖ తన పోస్టులో స్పష్టం చేశారు. ఆ వ్యాఖ్యలను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన క్యాబినెట్ నుంచి కొండా సురేఖను తొలగించిన కొన్ని రోజులకే ఈ పరిణామం జరగడం గమనార్హం. సరైన వివరణ ఇవ్వకుండా తనను మంత్రి పదవి నుంచి తొలగించడంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ మహిళను కావడం వల్లే తనను తప్పించారా అని కూడా ప్రశ్నించారు.

ఈ నేపథ్యంలో కొండా సురేఖ, ఆమె భర్త మురళి కాంగ్రెస్‌ను వీడి తిరిగి సొంత గూటికి (బీఆర్ఎస్) చేరవచ్చని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. కేటీఆర్‌తో ఉన్న పాత విభేదాలను పరిష్కరించుకుని, పార్టీలో చేరేందుకు మార్గం సుగమం చేసుకోవడంలో భాగంగానే ఈ క్షమాపణ చెప్పారని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ పరిణామంపై బీఆర్ఎస్ నాయకత్వం నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు.

తెలంగాణ పెట్టుబడులే లక్ష్యం!

(మొదటి పేజీ తరువాయి)

అంతరిక్ష సాంకేతికత, విమానయాన రంగాల్లో తెలంగాణకు ఉన్న అవకాశాలను ప్రదర్శించనున్నారు. ఈ రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలను ఆకర్షించడం, కొత్త పెట్టుబడులకు మార్గం సుగమం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. రక్షణ రంగానికి చెందిన సంస్థలు, పరిశోధనా సంస్థలు, నూతన ఆవిష్కరణలపై పనిచేస్తున్న సంస్థల భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పరిశ్రమల ప్రతినిధులు, ప్రభుత్వ విభాగాల మధ్య చర్చల ద్వారా కొత్త ప్రాజెక్టులకు అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ఉపాధి కల్పనకు ప్రాధాన్యం

పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో పరిశ్రమలు విస్తరించడం, కొత్త వ్యాపారాలు ప్రారంభం కావడం, యువతకు ఉద్యోగాలు అందుబాటులోకి రావడం వంటి ప్రయోజనాలను సాధించాలని ప్రభుత్వం ఆశిస్తోంది. తయారీ రంగంతోపాటు సాంకేతిక పరిజ్ఞానం, విమానయానం, ఔషధాలు, ఇతర అభివృద్ధి చెందుతున్న రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ప్రయత్నిస్తోంది. పెట్టుబడిదారులకు రాష్ట్రంలోని అవకాశాలను పరిచయం చేయడంతోపాటు వారి అవసరాలు, సూచనలను తెలుసుకోవడానికి కూడా ఈ సదస్సు వేదిక కానుంది. పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే అడ్డంకులను తగ్గించడం, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని పెంచడం ద్వారా వ్యాపార కార్యకలాపాలకు అనుకూల పరిస్థితులు కల్పించాలనేది ప్రభుత్వ ఉద్దేశం.

అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు

తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక సామర్థ్యం, మౌలిక సదుపాయాలను అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేసేందుకు గ్లోబల్ సమ్మిట్‌ను ప్రభుత్వం ఉపయోగించుకోనుంది. ఢిల్లీలో

నిర్వహించిన సన్నాహక కార్యక్రమం ప్రధాన సదస్సుకు ముందస్తు ప్రచారంలో భాగంగా నిలిచింది. డిసెంబరులో జరిగే సమావేశానికి పెట్టుబడిదారులను ఆహ్వానించడం, రాష్ట్రంలోని వ్యాపార అవకాశాలపై అవగాహన కల్పించడం ద్వారా పెట్టుబడుల సమీకరణకు బాటలు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. సదస్సు విజయవంతమవడమే కాకుండా, అందులో చర్చించిన పెట్టుబడుల ప్రతిపాదనలు వాస్తవ పరిశ్రమలుగా మారడం, వాటి ద్వారా ఉద్యోగాలు కల్పించడం కీలకం కానుంది. ఈ దిశగా ప్రభుత్వం చేపట్టే తదుపరి చర్యలు తెలంగాణ పారిశ్రామిక రంగ అభివృద్ధిలో ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి.

మార్చి నాటికి భారత్‌లో..

ఎండలతో 55 వేల మరణాలు?

ఎల్‌నినోపై కొత్త అంచనా!

భారత్‌కు ఎల్‌నినో రూపంలో మరో వాతావరణ ముప్పు పొంచి ఉందా? రాబోయే నెలల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు ప్రాణనష్టాన్ని పెంచే ప్రమాదం ఉందని తాజా పరిశోధన ఆధారిత అంచనాలు హెచ్చరిస్తున్నాయి. అమెరికాలోని షికాగో విశ్వవిద్యాలయానికి చెందిన 'క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్' రూపొందించిన కొత్త ట్రాకర్ ప్రకారం.. 2026 అక్టోబర్ నుంచి 2027 మార్చి వరకు భారత్‌లో అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 55 వేల మరణాలు సంభవించే అవకాశం ఉంది. వీటిలో ఎక్కువ భాగం మార్చిలోనే నమోదయ్యే ప్రమాదం ఉందని అంచనా. ఇది వాతావరణ సమాచారం, ఉష్ణోగ్రతల అంచనాలు, గతంలో వేడికి సంబంధించిన మరణాల మధ్య ఉన్న సంబంధాల ఆధారంగా రూపొందించిన నమూనా అంచనా మాత్రమే. వాస్తవంగా ఎంతమంది మరణిస్తారో ఇది కచ్చితంగా చెప్పడం లేదు.

ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తాయి. ఈసారి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని కొందరు నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) కూడా ఈ ఏడాది ఎల్‌నినో బలంగా ఉందని, డిసెంబర్‌లో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని హెచ్చరించింది. దీని ప్రభావాలు 2027 ప్రారంభం వరకు కొనసాగవచ్చని అంచనా. కొత్త ట్రాకర్ అంచనాల ప్రకారం.. అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 3.73 లక్షల మరణాలు సంభవించే

అవకాశం ఉంది. ఈ ఆరు నెలల కాలంలో నైజీరియాలో 56 వేల మరణాలు, భారత్‌లో 55 వేల మరణాలు సంభవించవచ్చని అంచనా. ఇండోనేషియాలో 29 వేలు, బ్రెజిల్‌లో 19 వేల మరణాలు సంభవించే ప్రమాదం ఉందని ట్రాకర్ పేర్కొంది. అయితే ఈ అంచనాలు మరణాలు తప్పనిసరిగా జరుగుతాయని చెప్పడం లేదు. ముందస్తు హెచ్చరికలు, తాగునీటి సదుపాయాలు, చల్లదనం కల్పించే కేంద్రాలు, కార్మికులకు రక్షణ, ఆరోగ్య సేవలను మెరుగుపరచడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు.

102 ఉద్యోగాలకు

టీజీపీఎస్సీ నుంచి కొత్త నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్‌లో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్ఓ) పోస్టులు ఉన్నాయి. అక్టోబర్ 30 నుంచి ఈ పోస్టులకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుండగా, నవంబర్ 27 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హతలు, వయోపరిమితి, ఫీజు వివరాలు

ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన అర్హతలు, వయోపరిమితి, ఫీజు వివరాలను టీజీపీఎస్సీ స్పష్టంగా వెల్లడించింది. స్టాటిస్టిక్స్‌ను ప్రధాన సబ్జెక్టుగా చదివి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు మాత్రమే ఈ ఉద్యోగాలకు అర్హులు. వయోపరిమితి విషయానికొస్తే, 2026 జులై 1 నాటికి అభ్యర్థుల వయసు కనీసం 18 ఏళ్లు నిండి, 44 ఏళ్లకు మించకూడదు. అయితే, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు వంటి రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయి. దరఖాస్తు రుసుముగా ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.1000 చెల్లించాల్సి ఉండగా, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.500గా నిర్ణయించారు.

ఆకర్షణీయమైన వేతనం..

ఈ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆకర్షణీయమైన వేతన స్కేలుతో పాటు సమాజంలో కీలక పాత్ర పోషించే అవకాశం లభిస్తుంది. కమిషన్ ప్రకటించిన ప్రకారం, ఉద్యోగంలో చేరిన వారికి నెలవారీ వేతనం రూ.36,750 నుంచి రూ.1,06,990 వరకు ఉంటుంది. ప్రభుత్వ పథకాల ప్రణాళిక, అమలులో ఈ పోస్టులది కీలక పాత్ర. మండల స్థాయిలో ప్రభుత్వానికి అవసరమైన గణాంకాలను సేకరించడం, వాటిని విశ్లేషించడం, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించడం వంటివి వీరి ప్రధాన బాధ్యతలుగా ఉంటాయి.

పరీక్ష విధానం.. ముఖ్యమైన తేదీలు

ఈ పోస్టుల భర్తీకి సంబంధించి రాత పరీక్షను జనవరి నెలలో నిర్వహించేందుకు కమిషన్ సన్నాహాలు చేస్తోంది. పరీక్షకు వారం రోజుల ముందుగా అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అక్టోబర్ 30న దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్నందున, ఆసక్తిగల అభ్యర్థులు చివరి తేదీ అయిన నవంబర్ 27 వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని కమిషన్ సూచించింది. జోన్ల వారీగా ఖాళీలు, సిలబస్, పరీక్ష విధానం వంటి పూర్తి వివరాల కోసం అధికారిక నోటిఫికేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు. ఏవైనా మార్పులు ఉంటే, వాటిని కమిషన్ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే వెల్లడిస్తుంది.

ఇక కబ్జా కుదరదు

(మొదటి పేజీ తరువాయి)

కాలుష్యం, కబ్జాలతో కునారిల్లుతోంది. చెరువు పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడం, పందులను వధించి వ్యర్థాలను చెరువులోనే పారబోయడం వంటి సమస్యలపై స్థానికులు 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన అధికారులు, ఆక్రమణలను నిర్ధారించుకున్న తర్వాత ఈ చర్యలు చేపట్టారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, మౌలాలి సర్కిల్ పరిధిలో ఉన్న ఈ చెరువు మొత్తం విస్తీర్ణం 75 ఎకరాలు. ఇప్పటికే ఇందులో 11 ఎకరాల మేర శాశ్వత నిర్మాణాలు వెలిశాయి. తాజాగా మరో 12 ఎకరాలను కూడా ఆక్రమించే ప్రయత్నాలు జరగడంతో హైడ్రా రంగంలోకి దిగింది. ఆక్రమణల తొలగింపుతో పాటు, ఇది చెరువు ఎఫ్‌టీఎల్ భూమి అని స్పష్టంగా తెలియజేస్తూ అధికారులు ప్రత్యేకంగా బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. ఈ చర్యతో మినీ ట్యాంక్‌బండ్‌కు పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు, పర్యావరణాన్ని కాపాడేందుకు మార్గం సుగమమైందని స్థానికులు భావిస్తున్నారు.

కరవు నిర్వహణలో చంద్రబాబు భేష్!

(మొదటి పేజీ తరువాయి)

రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపైనా కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నీటి సమస్యలు, వ్యవసాయ ఇబ్బందులు ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టుకు భారీగా ప్రజాధనం ఖర్చు చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులను వినియోగించాలని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. మరోవైపు మాజీ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఆమె చేసిన వ్యాఖ్యలను పరిశీలించిన తర్వాత న్యాయ నిపుణులతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటానని కేటీఆర్ తెలిపారు. తనపై విమర్శలు చేస్తున్నవారికి తగిన సమాధానం చెబుతానని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబునాయుడిపై తీవ్ర విమర్శలు చేసిన కేటీఆర్.. ఇప్పుడు ఆయన నీటి నిర్వహణను ప్రశంసించడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. తెలంగాణలోని రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడమే లక్ష్యంగా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు చర్చ జరుగుతోంది.

వాయిస్ టుడే
జనగళం - మనగళం
శుక్రవారం, అక్టోబరు 30, 2026

తిమ్మాపూర్ ను వెంటనే కరువు మండలంగా ప్రకటించాలి

మండలంలో కరువు పరిస్థితులు, రైతుల ఆవేదన,కన్నీళ్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకి కనిపించడం లేదా..?

తిమ్మాపూర్,అక్టోబర్ 29(వాయిస్ టుడే): పంటలు లేక,తీవ్రమైన నీటి కరువుతో అల్లాడుతున్న తిమ్మాపూర్ మండలాన్ని ప్రభుత్వం వెంటనే కరువు మండలంగా ప్రకటించి,నష్టపోయిన రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.తిమ్మాపూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మండల బిజెపి శాఖ అధ్యక్షులు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలోఎమ్మార్వో ఆఫీస్ ఎదుట హైదరాబాద్ రాజీవ్ రహదారి వద్ద రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా బిజెపి శ్రేణులు రాష్ట్ర ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.రాస్తారోకో వల్ల రాజీవ్ రహదారిపై ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలగడంతో పోలీసులు జోక్యం చేసుకొని బిజెపి నాయకులను కార్యకర్తలతో రాస్తారోకో విరమింప చేశారు. అనంతరం బిజెపి నేతలు మండల తహసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల ప్రకటనపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.అలాగే స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మండలంలో నీటి కరువు రావడం వల్ల రైతులు సాగుకు దూరమై తీవ్ర మనోవేదనకు గురవుతున్నారనీ,పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు మున్నీరు అవుతుంటే,మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి ఏం చేస్తున్నారు? నియోజకవర్గంలో తాండవిస్తున్న కరువు పరిస్థితులు,రైతుల అవస్థలు ఎమ్మెల్యే కంటికి కనిపించడం లేదా?"అని ఆయన సూటిగా ప్రశ్నించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో తిమ్మాపూర్ మండలం లేకపోవడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కరువు మండలాల జాబితాను కేవలం మొక్కుబడిగా మాత్రమే ప్రకటించిందన్నారు.కరువు మండలాలను ఎంపిక చేయడానికి ఉపయోగించిన అధికారిక గణాంకాలు సరిగా లేవనీ, జాబితాను చూస్తేనే ఇది ఎంత అశాస్త్రీయంగా తయారుచేశారో అర్థమవుతోందనీ ఘాటుగా వ్యాఖ్యానించారు.తీవ్రమైన లోటు వర్షపాతం నమోదు కావడం,పొలాలన్నీ బీళ్లుగా మారి రైతులు నీటికి తల్లడిల్లుతున్నా ఆ మండలాలను జాబితాలో చేర్చకపోవడం బాధాకరమన్నారు.మానకొండూరు నియోజకవర్గంలో అనేక మండలాల్లో అత్యల్ప వర్షపాతం నమోదై,సాగునీరు లేక తీవ్ర కరువు పరిస్థితులు తలెత్తాయన్నారు. ఆయా మండలాలు కరువు జాబితాలోకి వచ్చే అర్హత కలిగి ఉన్నాయనీ, అధికారులు,ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయికి వచ్చి రైతులతో మాట్లాడితేనే అసలు వాస్తవాలు తెలుస్తాయన్నారు. ముఖ్యంగా ఆ మండలాలను తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలనీ,ఎండిపోయిన పంటలకు తగిన నష్టపరిహారం చెల్లించడంతో పాటు,రైతాంగానికి వెంటనే ప్రత్యామ్నాయ సాగునీటి సౌకర్యాలు కల్పించాలనీ ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.నియోజకవర్గ ప్రజాప్రతినిధులు రాజకీయ లబ్ధిని, రాజకీయ ప్రయోజనాలను పక్కన పెట్టి, వాస్తవికత ఆధారంగా కరువు ప్రభావిత రైతులకు భరోసా కల్పించే చర్యలు చేపట్టాలనీ,రైతుల సమస్యలపై ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించకపోతే,బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.తక్షణం తిమ్మాపూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర,మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర చారి,జిల్లా నాయకులు, మావురపు సంపత్,బూట్ల శ్రీనివాస్,బోనాల మోహన్,మండల నాయకులు గొట్టుముక్కల తిరుపతిరెడ్డి,తమ్మనవేని రాజు,తూర్తి సంతోష్,వేల్పుల ఓదెలు,గడ్డం శ్రీనివాస్ రెడ్డి,బుర్ర శ్రీనివాస్ గౌడ్,పడాల శ్రీనివాస్ గౌడ్,గడ్డం అరుణ్,రాపర్తి రవి, ఎలుకపల్లి స్వామి,చింతం లక్ష్మణ్, దొనపాటి ప్రదీప్ రెడ్డి,బుడిగ మహేష్,బుడిగ నరేష్,రామిడి మహేందర్ రెడ్డి,ఈశ్వర చారి,దురిశెట్టి అజయ్,కన్నం సాయి కృష్ణ, కొక్కిస రమేష్,నరేష్ రవి,నరసయ్య, వేల్పుల నరేష్,ప్రశాంత్.రైతులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు పటేల్స్ సంఘం ఎన్నికల రాష్ట్ర కోఆర్డినేటర్ గా కాస రాజు పటేల్ నియామకం

కరీంనగర్,అక్టోబర్ 29(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు పటేల్ సంఘం రాష్ట్ర ఎన్నికల సమన్వయ కమిటీ కో ఆర్డినేటర్ గా కరీంనగర్ కి చెందిన కాసరాజు పటేల్ నియమించారు.కరీంనగర్ లోని ప్రైవేటు హోటల్లో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నవంబర్ లో నిర్వహించబోయే రాష్ట్రం మున్నూరు కాపు పటేల్ ఎన్నికల కమిటీని నియమించారు. ఈ సందర్భంగా కాస రాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సంఘానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని కుల సంఘంలోని ప్రతి ఒక్కరిని తమ ఓటు హక్కుని వినియోగించుకునేలా పాటుపడతానని తెలిపారు.

డంపింగ్ యార్డ్ సమస్యకు విముక్తి

మొదటి విడతగా 17 కోట్ల నిధులు మంజూరు

డంపింగ్ యార్డ్ కోసం కోతిరాంపూర్ చౌరస్తా లో పార్టీలకతీతంగా సంబరాలు నిర్వహించిన రాజకీయ నేతలు,స్థానిక ప్రజలు

కరీంనగర్,అక్టోబర్ 29(వాయిస్ టుడే): నగరవాసులను దశాబ్ద కాలంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న డంపింగ్ యార్డ్ దుర్గంధం,కాలుష్య సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారదిశగా అడుగులు లభించింది.డంపింగ్ యార్డ్‌కు ఇక బై బై.అని చెప్పే రోజు రానే వచ్చింది.గతంలో కరీంనగర్ పర్యటన సందర్భంగా నగర ప్రజలకు ఇచ్చిన మాటను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నిలబెట్టుకున్నారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి,కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ నిరంతర కృషి, పట్టుదలతో ఈ సుదీర్ఘ సమస్యకు విముక్తి కోసం ముందడుగు డంపింగ్ యార్డ్‌లోని వ్యర్థాల తొలగింపు (బయో మైనింగ్),నగర పారిశుద్ధ్య ఆధునీకరణ కోసం స్వచ్ఛ భారత్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం మొదటి విడతగా రూ. 17 కోట్ల నిధులను మంజూరు చేసింది.కరీంనగర్ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.ఇటీవల కరీంనగర్ పర్యటనకు వచ్చిన సందర్భంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సమస్య తీవ్రతను గ్రహించి, త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.చెప్పిన మాట ప్రకారమే స్వచ్ఛ భారత్ మిషన్ కింద రూ. 17 కోట్లు విడుదల చేయడంతో కరీంనగర్ ప్రజల నమ్మకాన్ని కమలం పార్టీ నిలబెట్టుకుందని స్థానికులు మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.దశాబ్దాల నాటి తీవ్రమైన రోగాల బారి నుండి,దుర్గంధం నుండి ఉపశమనం లభించనుండడంతో బిజెపి కార్పొరేటర్ మాసం గణేష్ ఆధ్వర్యంలో డంపింగ్ యార్డ్ సమీపంలో వివిధ వర్గాల ప్రజలు, స్థానికులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా బిజెపి కార్పొరేటర్ మాసం గణేష్ మాట్లాడుతూ కరీంనగర్ ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతుందని నగరవాసులకు నరకం చూపించిన డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సహాయ పడిన కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, బండి సంజయ్ కుమార్,మేయర్ కోలగాని శ్రీనివాస్,నగరపాలక సంస్థ ప్రతినిధులకు, అధికారులకు,జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కోసం స్వచ్ భారత్ మిషన్ కింద 17 కోట్ల నిధులు మంజూరు కావడం తో.బయో మైనింగ్ ప్రక్రియ శరవేగంగా పూర్తవుతుందని,రానున్న రోజుల్లో 80 కోట్ల నిధులతో డంపింగ్ యార్డ్ కు శాశ్వత విముక్తి లభించనుందని తెలిపారు.అతి త్వరలోనే కరీంనగర్ పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సుందర నగరంగా మారడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ విషయంలో అనవసర రాజకీయాలు చేస్తున్న బిఆర్ఎస్ పార్టీకి సిగ్గు ఉండాలని కార్పొరేటర్ మాసం గణేష్ ఘాటుగా విమర్శించారు.గత పదేళ్లు టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, కరీంనగర్ మూడుసార్లు ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రిగా పనిచేసిన గంగుల కమలాకర్ డంపింగ్ యార్డ్ తరలింపు విషయంలో నిర్లక్ష్యం గా వ్యవహరించి ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నందుకు సిగ్గుతో తలదించుకోవాలన్నారు.కరీంనగర్ డంప్ యార్డ్ ను మరణ శాసనమ్ ల తయారు చేసింది ఎవరని. ? గత దశాబ్ద కాలంగా డంపింగ్ యార్డ్ సమస్య కోసం ప్రజలంతా శాశ్వతంగా పరిష్కారానికి మార్గాలు చూపమని కోరితే,కేటీఆర్ కెసిఆర్ వచ్చినప్పుడల్లా అర్ధరాత్రుళ్ళు అరెస్ట్ లు చేసి నియంత పాలన కొనసాగించారన్నారు. పార్టీ జెండాలు పక్కన పెట్టి ప్రజల అరోగ్యం, జీవితాన్ని కాపాడుకోవడానికి గత బిఆర్ఎస్ ను ప్రాధేయపడితే చేసింది ఏంటి.ప్రశ్నిస్తే గత బిఆర్ఎస్ నాయకులతో అక్రమ కేసులు పెట్టింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కృషితో ఇప్పుడు డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారమైతే చూసి ఓర్వలేక మళ్ళీ చిల్లర రాజకీయలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇకనైనా బిఆర్ఎస్ నేతలు పనికిమాలిన రాజకీయాలు మానుకొవాలనీ హెచ్చరించారు.నగర ప్రజల నమ్మకాన్ని బిఆర్ఎస్ పూర్తిగా కోల్పోయిందని,ప్రజల నమ్మకంతోనే బల్దియా ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా నిలిచారని,ప్రజలు బిజెపిపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తుంటే జీర్ణించుకోలేని స్థితిలో బిఆర్ఎస్ ఉందన్నారు.ఇప్పటికైనా బిఆర్ఎస్ తన బుద్ధిని మార్చుకోవాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు ఏపీపీ చంద్ర,తోట అనిల్,మ్యకల వెంకటేష్,వివిధ డివిజన్ ప్రజలు,ఆటోనగర్ బాధ్యులు పాల్గొన్నారు.

స్ట్రోక్ చికిత్సలో ప్రతి నిమిషం విలువైనది

కరీంనగర్,అక్టోబర్ 29(వాయిస్ టుడే): స్ట్రోక్ లక్షణాలు కనిపించిన వెంటనే వీలైనంత త్వరగా స్ట్రోక్ రెడీ ఆసుపత్రికి తీసుకెళితే మెరుగైన ఫలితం ఉంటుందని కరీంనగర్ మెడికవర్ వైద్యులు వెల్లడించారు.స్ట్రోక్ చికిత్సలో ప్రతి నిమిషం విలువైనదని,లక్షణాలు కనిపించిన వెంటనే స్పందించాలని సూచించారు.వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సంజయ్ కమిన్వర్,ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ సత్యనారాయణ,క్రిటికల్ కేర్ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి పాల్గొని స్ట్రోక్‌పై అవగాహన కల్పించారు.మెదడుకు రక్త సరఫరా నిలిచిపోవడం లేదా మెదడులో రక్తనాళం చిట్లడం వల్ల స్ట్రోక్ సంభవిస్తుందని వివరించారు. ముఖం ఒకవైపు వాలిపోవడం,చేయి,కాలు కదల్చకపోవడం,మాట తడబడటం, అకస్మాత్తుగా చూపు మందగించడం, బ్యాలెన్స్ కోల్పోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. మెదడులో రక్తం గడ్డకట్టడం,రక్తస్రావం జరగడం అనే రెండు ప్రధాన రకాలుంటాయని తెలిపారు.నాలుగున్నర గంటలలోపు సీటీ,ఎమ్మారై స్కాన్,క్యాథలాబ్ సౌకర్యమున్న స్ట్రోక్‌రెడీ ఆసుపత్రికి తీసుకువస్తే ఐవీ త్రోంబాలైసిస్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా రక్తనాళాల్లో ఏర్పడిన గడ్డను కరిగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఆలస్యం చేయడం వల్ల వైకల్యలంతో పాటు ప్రాణాలకే ప్రమాదమన్నారు.అధిక రక్తపోటు, మధుమేహం,అధిక కొలెస్ట్రాల్, ధూమపానం,శారీరక శ్రమ లేకపోవడం వంటి అంశాలు స్ట్రోక్ ముప్పును పెంచుతాయని తెలిపారు.రక్తపోటు, మధుమేహాన్ని నియంత్రించుకోవడం, వ్యాయామం చేయడం ద్వారా ముప్పును తగ్గించుకోవచ్చున్నారు.అన్ని విభాగాల వైద్యులు,పరికరాలు సిద్దంగా ఉన్న స్ట్రోక్ రెడీ మెడికవర్ ఆసుపత్రిలో వేగవంతమైన పరీక్షలు,సూపర్ స్పెషాలిటీ వైద్యుల సేవలు అందడం మూలంగా మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు.ఈ అవగాహన సదస్సులో ఆసుపత్రి సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ హెడ్ కోట కర్ణాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్.ఐ.ఆర్ పై చేస్తున్న దుష్ప్రచారం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు.

ఓటరు జాబితా సవరణ సాకుతో రాజకీయ లబ్దికోసం కాంగ్రెస్ పార్టీ ఆంధోళన చేయడం దుర్మార్గం

కరీంనగర్,అక్టోబర్ 29(వాయిస్ టుడే): కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పూర్తిగా తగ్గిపోయిందిని గతంలో 45 శాతంగా ఉన్న కాంగ్రెస్ ఓటు బ్యాంక్ 20 శాతానికి పడి పోయిందిని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు విరుచుకు పడ్డారు.ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకి ఓటమే ఎదురుకావడంతో ఏం చేయాలో తోచక,గత నెల రోజులుగా ఎస్.ఐ.ఆర్ సాకుతో ఆందోళనకు తెరలేపారని మండి పడ్డారు కరీంనగర్ గురువారం విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ గత కొంతకాలం ఈవీ ఎంల మీద నిరాధార ఆరోపణలు గుప్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరగాలని డిమాండ్ చేసి పలు రాష్ట్రాల్లో 26 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీకి నాలుగు రాష్ట్రాల్లో కనీసం ఒక్క స్థానం కూడ దక్కలేదని ఎద్దేవ చేశారు.బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరిగి ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ బ్యాలెట్ ఎన్నిక కూడ మోసం అంటారా? ఆ పార్టీ నాయకులు పునరాలోచన చేస్కోవాలని ద్వజమెత్తారు. ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతి సారి ఎస్ఐఆర్ పై ఆంధోళన చేయడం కాంగ్రెస్ పార్టీ నాయకుల నైజాంగా మారిందని నిప్పులు చెరిగారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు దాదాపు 12 సార్లు ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టడం జరిగిందని,ఇందులో 10 సార్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం గమనార్హం అన్నారు.చివరిసారి ఎస్ ఐఆర్ ప్రక్రియ జరిగి 20 సంవత్సరాలు దాటిందని2004 తర్వత 2026 లో ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టి జాబితాను ప్రక్షాళన చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ రకరకాల ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారం చేస్తూ అడ్డుకునే ప్రయత్నం చేయడం సిగ్గు చేటని విరుచుకు పడ్డారు.ఎస్ఐఆర్ చేపట్టిన తర్వతా కేరళ, తమిళనాడు,పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బిన్నమైన ఫలితాలు వెలువడ్డాయని, కేరళలో కాంగ్రెస్ పార్టీ, తమిళనాడు లో టీవికే మిత్రపక్షాలు అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవిషయంపై నోరు విప్పరుకానీ బీజేపి అధికారంలోకి వచ్చిన చోట మాత్రం నిరాధారణ ఆరోపణలతో దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. అలాగే ఒక నగరం నుంచి మరో నగరానికి షిఫ్ట్ అయిన కోట్లాది మంది ఓటర్ల విషయంలో, డూప్లికేట్ ఓటర్లను తొలగిస్తే కాంగ్రెస్ పార్టీకి వచ్చిన నష్టం ఏమిటని.ఆ ఇబ్బంది ఏమిటో వారు ఎక్కడా చెప్పడం లేదని దాని ఆంతర్యం ఏంటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.దేశంలోని 29 రాష్ట్రాల్లో దాదాపు 7 నుంచి 20 రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘకాలంగా అధికారానికి దూరంగా ఉందిని,తమిళనాడులో 60 సంవత్సరాల నుంచి,పశ్చిమ బెంగాల్‌లో 49 సంవత్సరాల నుంచి,ఉత్తరప్రదేశ్‌లో 37 సంవత్సరాల నుంచి,బీహార్‌లో 36 సంవత్సరాల నుంచి,గుజరాత్‌లో 31 సంవత్సరాల నుంచి,ఒడిశాలో 26 సంవత్సరాల నుంచి ఇలా సుమారు 20 రాష్ట్రాల్లో 10 నుండి 60 సంవత్సరాలుగా కాంగ్రెస్ అధికారంలో లేకపోవడానికి సర్ ప్రక్రియకు ఏం సంబందం అని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోవడానికి కారణం సర్ ప్రక్రియణా అని విరుచుకు పడ్డారు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించడానికి,అపోహలు సృష్టించడానికి మాత్రమే ఈ కృత్రిమ ఆందోళనలు చేస్తున్నారని ద్వజమెత్తారు.యువత ఓట్లు తొలగిస్తున్నారు. మరణించిన ఓట్లు తొలగించవద్దు, డబుల్ ఓట్లు తీసేయవద్దు,షిఫ్ట్ అయిన ఓటర్లను అలాగే ఉంచాలి అంటే ఓటర్ జాబితా తప్పులతడకగానే ఉండాలన్నదే కాంగ్రెస్ పార్టీ నాయకుల ఉద్దేశము తెలుపాలని డిమాండ్ చేశారు.సర్ రాకముందు ఎన్నికల్లో పోలింగ్ శాతం కేవలం 50-60 శాతానికి మించేది కాదు.కానీ సర్ ప్రక్షాళన తర్వాత జరిగిన ఎన్నికల్లో పోలింగ్ శాతం 90-92 శాతానికి పెరిగిందని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు లభించి,ఓటర్లందరూ పోలింగ్‌కు వస్తే అది ప్రజాస్వామ్యానికి నిజమైన నిదర్శనం అన్నారు. ఉదాహరణకు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పాత పద్ధతిలో పోలింగ్ శాతం 50 శాతాన్ని కూడా దాటలేదు.దీన్నిబట్టి పాత ఓటర్ జాబితాల స్వరూపం ఎలాంటిదో అర్థం చేసుకోవచని స్పష్టం చేశారు. నవంబర్ 1న రాంలీలా మైదాన్‌లోనో,ఇంకెక్కడో ఆందోళనలు చేసుకోండి.కానీ సర్ మీద ఒక్క ఆధారం కూడా చూపించలేని దౌర్భాగ్య స్థితిలో కాంగ్రెస్,దాని మిత్రపక్షాలు ఉన్నాయని విమర్శించారు. సుప్రీంకోర్టు ప్రశ్నించినా సరే, ఇప్పటివరకు ఏ ఒక్క సింగిల్ ఆధారాన్ని కూడా వారు ప్రవేశపెట్టలేక పోవడం చాలా దుర్మార్గం అన్నారు.రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తాము వెనుకబడిపోతున్నామనే భయంతో ఇలాంటి కృత్రిమ ఆందోళనలకు దిగుతున్నారని,దీని వెనుక ఎవరున్నారు,ఎవరు ఫండింగ్ చేస్తున్నారు అనేది ప్రజలందరికీ స్పష్టంగా తెలుసన్నారు. బెంగాల్, కేరళ,తమిళనాడు ఎన్నికల్లో ఏ ఒక్క ఓటరూ వచ్చి నా ఓటు ఎందుకు లేదు?" అని ప్రశ్నించలేదని గుర్తు చేశారు.ఎందుకంటే అర్హులైన ప్రతి ఒక్కరి ఓటూ అక్కడ ఉంది కాబట్టే 92-93 శాతం పోలింగ్ నమోదయిందని తెలిపారు.నరేంద్ర మోడీ నాయకత్వంలో గత 12-13 సంవత్సరాలుగా దేశంలో జరుగుతున్న అభివృద్ధి, పెరుగుతున్న భారతదేశ శక్తిని చూసి ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు 12-13 సంవత్సరాలుగా ఒక్క చిన్న అవినీతి ఆరోపణ కూడా లేకుండా దేశం కోసం పనిచేస్తున్న ప్రధాని మోడీ పట్ల ప్రజల్లో సానుభూతి, ఆదరణ అంతకంతకూ పెరుగుతుంటాయని. కార్పొరేటర్స్ వంగల పవన్, కొంపెల్లి రామణ్, బండారి వేణు,బండ రమణారెడ్డి,గాజ శివరాం,మేకల వెంకటేష్, కేఏపిపి చంద్ర,మాసం గణేష్,సోమిడి వేణు,పొన్నం మొండయ్య గౌడ్, గొట్టేముక్కల వెంకటరమణ, కో-ఆప్షన్ సభ్యులు కన్న కృష్ణ, చిగురు రవి,బిజెపి నాయకులు కటకం లోకేష్ కుమార్,బండి ప్రశాంత్,సత్తిరెడ్డి,వెంకటరెడ్డి, పండుగ నాగరాజు,అబ్దుల్ హమీద్, కుంభం అనిల్,అమీర్,అజ్జు, ఖాజా,ఫరూక్,మోతే శ్రీనివాస్ పాల్గొన్నారు

ఎల్‌నినో నేపథ్యంలో తాగునీరు, విద్యుత్తు పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి

గ్రామాల్లో జలసిరి పనులను వేగవంతం చేయాలి.. అధికారులకు కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశాలు

కరీంనగర్,అక్టోబర్ 29(వాయిస్ టుడే): ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి లభ్యత,విద్యుత్తు వినియోగం విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాల నేపథ్యంలో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. తాగునీటిని అవసరమైన మేరకే వినియోగించేలా ప్రజలను అప్రమత్తం చేయాలని,విద్యుత్తును పొదుపుగా వాడుకోవడంపై గ్రామగ్రామాన విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. భవిష్యత్తులో తాగునీరు,విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా సమన్వయంతో కార్యాచరణ చేపట్టాలని స్పష్టం చేశారు. కరీంనగర్ ఐడీఓసీలో వి.బి.జీ రామ్ జీ పథకం కింద చేపడుతున్న పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.గ్రామాల్లో జలసిరి పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రతి గ్రామంలో భూగర్భ జలాల పెంపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని,వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేలా పనులు చేపట్టాలని సూచించారు.గ్రామాల్లో తాగునీటి బోర్ల రీఛార్జికి చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ, ప్రజలు తాగునీటిని వృథా చేయకుండా అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా చైతన్యపరచాలన్నారు. జలసిరి పనులు లక్ష్యానికి అనుగుణంగా పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.రాబోయే రోజుల్లో విద్యుత్తు వినియోగం,సరఫరాకు సంబంధించి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.గృహ వినియోగదారులతో పాటు వ్యాపారులు, వాణిజ్య సంస్థలు,వర్తక సంఘాలు విద్యుత్తును పొదుపుగా వినియోగించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రజల్లో బాధ్యతాయుత వినియోగంపై అవగాహన పెంపొందించాలని సూచించారు.పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు కనీస అవసరాలైన తాగునీరు,విద్యుత్తు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.జిల్లా పంచాయతీ అధికారులు అంగన్‌వాడీ భవనాలు,గ్రామపంచాయతీ భవనాలు,మహిళా సంఘాల భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.ఎంపీడీవోలు,మండల స్థాయి అధికారులు అభివృద్ధి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జెడ్పీ సీఈవో శ్రీనివాస్,డీఆర్‌డీవో గీత, డీపీవో జగదీశ్వర్,పీఆర్ ఈఈ జనార్దన్‌తో పాటు పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో బూత్ లెవెల్ కమిటీలు పటిష్ట పరచాలి

బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్, కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు

నాగుల మల్యాల,అక్టోబర్ 29(వాయిస్ టుడే): ప్రతి గ్రామంలో బూత్ లెవెల్ కమిటీలను పటిష్ట పరచాలని,పార్టీ నిర్మాణంలో బూత్ లెవెల్ కమిటీలే కీలకమని బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్, కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు అన్నారు. కొత్తపల్లి మండల అధ్యక్షుడు కుంట తిరుపతి ఆధ్వర్యంలో నాగుల మల్యాల గ్రామంలో బూత్ లెవెల్ కమిటీలను బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్, కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రవీణ్ రావు మాట్లాడుతూ పార్టీ నిర్మాణంలో బూత్ లెవెల్ కమిటీలే కీలకమని కావున మండలంలోని ప్రతి గ్రామంలో బూత్ లెవెల్ కమిటీలు పటిష్ట పరచాలని కోరారు.ప్రధాని మోదీపై కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ఓట్ చోరీని నిరసిస్తూ నవంబర్ 5 వ తేదీన జరగబోయే మహార్యాలీలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు పాల్గొని కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్ర ఇంచార్జి గొడిసెల రంజిత్,ఉపసర్పంచ్ కట్ల వెంకటేష్,వార్డు సభ్యులు వరాల రాజు,మ్యాక నరేష్,గొడిసెల మౌనిక,మాజీ ఉపసర్పంచ్ కట్ల సుమలత శ్రీనివాస్,బాలమణి, అనిల్, తిరుపతి,రాజు,బుర్ర మనోహర్ పాల్గొన్నారు

మున్నూరు కాపుల దశాబ్దాల కల సాకారం

తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి

హైదరాబాద్,అక్టోబర్ 29(వాయిస్ టుడే): కోకాపేటలో మున్నూరు కాపు ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి 5 కోట్లు కేటాయించినందున జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కల్చరల్ సెంటర్ లో మున్నూరు కాపు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఘనంగా ధన్యవాదాల కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిమాట్లాడుతూ మున్నూరు కాపుల దశాబ్దాల కల అయిన ఆత్మగౌరవ భవన నిర్మాణానికి నిధులు కేటాయించి,సమాజ గౌరవాన్ని పెంచినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మున్నూరు కాపు బంధువుల తరఫున హృదయపూర్వక ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.ఈ కృతజ్ఞత సభలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ,ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ గద్వాల విజయ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్,మాజీ శాసనసభ్యులు దానం నాగేందర్, సోమారపు సత్యనారాయణ, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్,వినయ్ కుమార్,బొంతు రామ్మోహన్,గాలి అనిల్ కుమార్,బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి పాల్గొన్నారు.

ధాన్యం అమ్మకాలపై ఆందోళన వద్దు,ప్రతి గింజను కొంటాం

రైతులకు భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

తిమ్మాపూర్,అక్టోబర్ 29(వాయిస్ టుడే): రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మానకొండూరు ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు.ధాన్యం అమ్మకాల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట, మహాత్మానగర్ గ్రామాల్లో హాకా, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అవసరమైన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు.ధాన్యం సేకరణకు అవసరాన్ని బట్టి మరిన్ని కేంద్రాలను కూడా అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.రైతులందరూ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వం ప్రకటించిన విధంగా సన్న వడ్లకు బోనస్ తప్పకుండా అందజేస్తామని,ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని స్పష్టం చేశారు.ధాన్యం విక్రయించే సమయంలో రైతులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో చెల్లింపులు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమాల్లో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య,తహసీల్దార్ కె.శ్రీనివాస్ రెడ్డి, నుస్తులాపూర్ పీఏసీఎస్ చైర్మన్ మోరపల్లి రమణారెడ్డి,పోరండ్ల పీఏసీఎస్ చైర్మన్ గోపు తిరుపతిరెడ్డి,ఆయా గ్రామాల సర్పంచులు ఎలుక ఆంజనేయులు,పొన్నాల సంపత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్,గ్రామశాఖ అధ్యక్షుడు ఎలుక రాజు,అంకూస్,కాంగ్రెస్ నాయకులు గంకిడి లక్ష్మారెడ్డి,గోపు మల్లారెడ్డి,మామిడి అనిల్ కుమార్,పులి కృష్ణ,కుంట రాజేందర్ రెడ్డి,బుధారపు శ్రీనివాస్,కొత్త తిరుపతిరెడ్డి, రెడ్డిగాని రాజు,తమ్మనవేణి రాములు యాదవ్,కేతిరెడ్డి ఎల్లారెడ్డి,అయితం వెంకన్న,రాచపల్లి దుర్గాప్రసాద్,పోలు రాము,రమేశ్ పాల్గొన్నారు.

మన భవిష్యత్తు మన చేతులు, చేతల్లోనే ఉంది

ప్రముఖ రచయిత,లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

మంచిర్యాల,అక్టోబర్ 29(వాయిస్ టుడే): మన ఉజ్వల భవిష్యత్తుకు నిర్మాతలు మనమే అని,మన క్రమశిక్షణ కలిన చేతలతోనే మనం నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకుంటామని ప్రముఖ రచయిత, కాలమిస్ట్,మోటివేషనల్ స్పీకర్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. చెన్నూరు,దండెపెల్లి పిఎమ్ శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను శ్రద్ధగా వినడం,ఏ రోజుకు ఆ రోజు గడిచిన పాఠాలను పుస్తకాల్లో చదివి అర్థం చేసుకోవడం వల్ల పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.మన దినచర్య సక్రమంగా ఉంటే సగం విజయం వరించినట్లే అని అభిప్రాయపడ్డారు.పాఠశాల తరగతి గదిలో ఏకాగ్రతతో పాఠాలను వినడం వల్ల విషయ పరిజ్ఞానం పెరుగుతుందని,ప్రతి రోజు ఉదయం,సాయంత్రం వేళల్లో 4 గంటల పాటు చదవడం లేదా రాయడం దినచర్యలో భాగం కావాలని అన్నారు.విద్యతో పాటు వివేకం,చదువుతో పాటు సంస్కారం పెంపొందించుకోవడం తప్పనిసరి అని తెలిపారు.ప్రతి విద్యార్థి తన పరీక్షల్లో గతంతో పోల్చితే అధిక మార్కులు సాధించి తమ సత్తా చాటుకోవాలని అన్నారు.పాఠశాల హెచ్ఎం ఫణి రాజ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో చెన్నూరు లయన్స్ క్లబ్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు,ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

చెరబండరాజు నగర్ కాలనీవాసులకు బీఆర్ఎస్ అండ

పేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదు మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

హ్యూమన్ రైట్స్ కమిషన్‌లో గుడిసెల వివాదంపై వాదనలు

హనుమకొండ జిల్లా, అక్టోబర్ 29 (వాయిస్ టుడే): హనుమకొండలోని చెరబండరాజు నగర్ కాలనీవాసుల గుడిసెల సమస్యపై బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ భరోసా ఇచ్చారు. కాలనీవాసుల హక్కులను కాపాడేందుకు చట్టపరంగా పోరాడతామని స్పష్టం చేశారు. చెరబండరాజు నగర్ కాలనీవాసుల గుడిసెలకు సంబంధించిన అంశంపై గురువారం హైదరాబాద్‌లోని మానవ హక్కుల కమిషన్‌లో వాదనలు జరిగినట్లు కాలనీవాసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి వచ్చే నెల 30వ తేదీన జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, కుడా పీవో హాజరుకావాలని కమిషన్ ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ హనుమకొండలోని నిరుపేదలకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని, పేదలకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. గుడిసెవాసుల హక్కులను పరిరక్షించేందుకు చట్టపరమైన మార్గాల్లో పోరాడతామని హామీ ఇచ్చారు. నిరుపేద కుటుంబాలకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చెరబండరాజు నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ప్రధాన సమస్యల పరిష్కారం కోసం టీడీపీ సంఘీభావం

కరీంనగర్,అక్టోబర్ 29(వాయిస్ టుడే): ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ప్రధాన సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ఉద్యోగులకు మద్దతుగా కలెక్టర్ కార్యాలయం వద్ద టీడీపీ తరఫున సంఘీభావం తెలియజేశారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల అధ్యక్షుడు సాగర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం, టీడీపీ యువ నాయకుడు కళ్యాడపు నరేష్ పటేల్ పాల్గొని, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఉద్యోగులకు టీడీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

మోహన్ రెడ్డి మరణం ప్రజాఉద్యమాలకు తీరని లోటు

సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

కరీంనగర్,అక్టోబర్ 29(వాయిస్ టుడే): పేదలు,బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం తన జీవితాంతం కృషి చేసిన సీపీఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ ఎడవెల్లి మోహన్ రెడ్డి మరణం ప్రజా ఉద్యమాలకు,ముఖ్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సీపీఎంకు తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. కార్మికుల హక్కుల సాధనతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన మోహన్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.సిపియం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ముకుంద లాల్ మిశ్రా భవన్‌లో కామ్రేడ్ కోనేటి నాగమణి అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ ఎడవెల్లి మోహన్ రెడ్డి సంస్మరణ సభలో మిల్కూరి వాసుదేవరెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా మోహన్ రెడ్డి పార్టీకి,కార్మిక ఉద్యమానికి,వివిధ ప్రజా సంఘాలకు అందించిన సేవలను స్మరించుకున్నారు.మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ఎడవెల్లి మోహన్ రెడ్డి ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూనే ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, కార్మికుల హక్కుల పరిరక్షణకు విశేషంగా కృషి చేశారని తెలిపారు. జిల్లాలో ఆర్టీసీలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ స్థాపనలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం,వారి హక్కుల సాధన కోసం సంఘటిత పోరాటాల ప్రాధాన్యతను గుర్తించి పనిచేశారని పేర్కొన్నారు.ఉద్యోగ ధర్మాన్ని నిర్వహిస్తూనే మూడు దశాబ్దాలకు పైగా ప్రజా ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేయడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి,జి బీమా సాహెబ్,జిల్లా కమిటీ సభ్యులు ఉప్పునూటి శ్రీనివాస్,జి.రాజేశం, డి.నరేష్ పటేల్,నాయకులు కే.అరవింద్,పుల్లెల మల్లయ్య,ఎంకే తాజుద్దీన్,తిరుమలయ్య,శ్రీనివాస్, శివకుమార్,అరవింద్,రాజ్ కుమార్, అశోక్,ప్రకాష్,సాయి పాల్గొన్నారు.

కరీంనగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్,మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు

కరీంనగర్,అక్టోబర్ 29(వాయిస్ టుడే): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో కరీంనగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేది బీజేపీ పాలకవర్గమే అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు.కరీంనగర్ నగరంలో గానీ,రాష్ట్రంలో గానీ భారతీయ జనతా పార్టీ ఎన్నడూ అధికారంలో లేదు.స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గానీ,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గానీ, తెలంగాణ రాష్ట్రంలో గానీ బీజేపీ ఎప్పుడూ అధికారంలో లేదు.మరి అలాంటప్పుడు కరీంనగర్‌లోని డంప్ యార్డ్‌కు మూలకారణం ఎవరు? ఆ డంప్ యార్డ్‌ను అక్కడ సృష్టించింది ఎవరు? ఈ విధంగా నగరాన్ని దగా చేసింది ఎవరు? అనేది నగర ప్రజలు మొదటగా గమనించాలని యాదగిరి సునీల్ రావు కోరారు.డంప్ యార్డ్‌ను సృష్టించిందే ఆయా పార్టీల పాలకవర్గాలని,ఈ రోజు ప్రజలు నరకం అనుభవిస్తున్నారంటే, ఇబ్బంది పడుతున్నారంటే దానికి ఆనాడు అధికారంలో ఉన్న పాలకవర్గాలే పూర్తి కారణమని స్పష్టం చేశారు.రూ.18 కోట్ల స్వచ్ఛ భారత్ నిధులతో బయో మైనింగ్ చేపట్టి,డంప్ యార్డ్‌లో ఉన్న చెత్త మొత్తాన్ని క్లియర్ చేయాలనే ఆలోచనతో టెండర్లు పిలిచామని, గత నెల 26వ తారీఖున టెండర్లు కూడా విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు.మరో 10 రోజుల్లో వర్క్ ఆర్డర్ ఇస్తామని, అక్కడ ఉన్న డంప్ మొత్తాన్ని 9 నెలల నుండి ఏడాది లోపల పూర్తిగా క్లియర్ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నామని, ఇది చాలా గొప్ప కార్యక్రమమని పేర్కొన్నారు.రూ.80 కోట్లతో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ అంతేకాకుండా,తదనంతరం రూ. 80 కోట్ల నిధులతో అధునాతన సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా ప్రతిరోజూ వచ్చే చెత్తను రోజూవారీగా ప్రాసెస్ చేసి, భవిష్యత్తులో మళ్లీ డంప్ అనేది లేకుండా చూసి నగర ప్రజలకు ప్రశాంతమైన,పరిశుభ్రమైన, స్వచ్ఛమైన వాతావరణం అందిస్తామన్నారు.బండి సంజయ్ నాయకత్వంలో బీజేపీ పాలకవర్గం ఈ లక్ష్యంతోనే పనిచేస్తోందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో కార్పొరేటర్స్ వంగల పవన్,కొంపెల్లి రామణ్,బండారి వేణు,బండ రమణారెడ్డి,గాజ శివరాం,మేకల వెంకటేష్,కేఏపిపి చంద్ర,మాసం గణేష్,సోమిడి వేణు,పొన్నం మొండయ్య గౌడ్,గొట్టేముక్కల వెంకటరమణ,కో-ఆప్షన్ సభ్యులు కన్న కృష్ణ,చిగురు రవి,బిజెపి నాయకులు కటకం లోకేష్ కుమార్, బండి ప్రశాంత్,సత్తిరెడ్డి,వెంకటరెడ్డి, పండుగ నాగరాజు,అబ్దుల్ హమీద్, కుంభం అనిల్,అమీర్,అజ్జు,ఖాజా, ఫరూక్,మోతే శ్రీనివాస్ పాల్గొన్నారు

రాజకీయాలకు అతీతంగా మున్నూరు కాపుల ఐక్యతే లక్ష్యం!

జనాభా గణాంకాల స్పష్టత కోసం ప్రతి ఒక్కరూ సభ్యత్వం నమోదు చేసుకోవాలి, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలి.. అన్ని పార్టీల నేతలు స్పందించాలి, దేశవిదేశాల్లోని కులబాంధవులకూ సభ్యత్వ అవకాశం: కొండ దేవయ్య పటేల్

కరీంనగర్, అక్టోబరు 29 (వాయిస్ టుడే): మున్నూరు కాపుల సామాజిక ఐక్యతను బలోపేతం చేయడంతోపాటు, రాష్ట్రవ్యాప్తంగా కులబాంధవుల సమగ్ర జనాభా వివరాలను సేకరించడమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలంగాణ మున్నూరు కాపు సంఘం (పటేల్స్) వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సంఘటితమై సామాజిక హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్‌లోని రాధా హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్నూరు కాపులు వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్నప్పటికీ, సామాజిక ప్రయోజనాల విషయంలో మాత్రం ఒకే వేదికపైకి రావాలని దేవయ్య పటేల్ సూచించారు. వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కంటే సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని అన్నారు. గత రెండు దశాబ్దాలుగా మున్నూరు కాపుల సంఘటిత శక్తి కోసం పనిచేస్తున్నానని, ఉమ్మడి పది జిల్లాల నుంచి ప్రస్తుత 33 జిల్లాల వరకు సంఘాల ఏర్పాటు, నాయకత్వ నిర్మాణంలో భాగస్వామినయ్యానని వివరించారు. మున్నూరు కాపుల జనాభాకు సంబంధించి వేర్వేరు సర్వేల్లో భిన్నమైన గణాంకాలు వెల్లడవుతున్నాయని దేవయ్య పటేల్ పేర్కొన్నారు. తమ అంచనా ప్రకారం రాష్ట్రంలో మున్నూరు కాపుల జనాభా సుమారు 51 లక్షలు ఉండగా, గత కుటుంబ సమగ్ర సర్వేలో 28 లక్షలుగా నమోదైందని తెలిపారు. తాజా కులగణనలోనూ జనాభా తక్కువగా నమోదైందని ఆయన అభిప్రాయపడ్డారు. వాస్తవ జనాభాపై స్పష్టత రావాలంటే ప్రతి కుటుంబం సభ్యత్వ నమోదు చేసుకోవాలని కోరారు. మున్నూరు కాపుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. విద్యార్థుల కోసం హాస్టల్ నిర్మాణానికి రెండు ఎకరాల స్థలం, అవసరమైన నిధులు కేటాయించాలని గతంలో పలువురు ప్రజాప్రతినిధులు, మంత్రులను కలిసి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఈ అంశాలపై హామీలు వచ్చినప్పటికీ ఆశించిన స్థాయిలో కార్యాచరణ కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. జనాభా, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్న మున్నూరు కాపు ప్రజాప్రతినిధులు సామాజిక వర్గ అభివృద్ధి కోసం సమష్టిగా కృషి చేయాలని దేవయ్య పటేల్ విజ్ఞప్తి చేశారు. బండి సంజయ్, గంగుల కమలాకర్, పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, చల్లా హరిశంకర్ తదితర నాయకులు మున్నూరు కాపుల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. రాజకీయంగా వేర్వేరు పార్టీల్లో ఉన్నా సామాజిక సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. తెలంగాణతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాలు, విదేశాల్లో నివసిస్తున్న మున్నూరు కాపులందరికీ సభ్యత్వ నమోదు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేయడం ద్వారా సమగ్ర జనాభా సమాచారం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. వెబ్‌సైట్ ద్వారా సభ్యత్వ నమోదు చేపడుతున్నామని, ప్రతి కుటుంబం సుమారు పది నిమిషాలు కేటాయించి సభ్యులందరి వివరాలు నమోదు చేయాలని కోరారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక అభివృద్ధి రంగాల్లో మున్నూరు కాపులు మరింత ముందుకు సాగాలంటే ఐక్యత అవసరమని దేవయ్య పటేల్ అన్నారు. వేములవాడలో మున్నూరు కాపు సత్రం నిర్మాణం, వివిధ జిల్లాల్లో సంఘాల ఏర్పాటు కోసం గతంలో కృషి చేసినట్లు గుర్తుచేశారు. భవిష్యత్తులోనూ సామాజిక సమస్యల పరిష్కారానికి తన వంతు ప్రయత్నం కొనసాగిస్తానన్నారు. సభ్యత్వ నమోదు ద్వారా సంఘటిత శక్తిని పెంచుకుని హక్కుల సాధనకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం మున్నూరు కాపు సభ్యత్వ నమోదు వెబ్‌సైట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం కమిటీ సభ్యులు కోల అన్నారెడ్డి, ఎర్రం రాజు రెడ్డి, నామిని సత్యనారాయణ, కాసరాజు పటేల్,

కాజీపేటలో గుడిసెల తొలగింపు యత్నం.. ఉద్రిక్తత

వైఎస్సార్ నగర్ భూముల వివాదంపై ఆందోళన

1997 ప్రభుత్వ రికార్డులు పరిశీలించాలని గుడిసెవాసుల డిమాండ్

కాజీపేట, అక్టోబరు 29 (వాయిస్ టుడే): కాజీపేట మండలం కడిపికొండ గ్రామ పరిధిలోని వైఎస్సార్ నగర్‌లో భూముల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. సుమారు 25 ఏళ్లుగా నివాసం ఉంటున్న తమ గుడిసెలను కొందరు వ్యక్తులు డోజర్లతో తొలగించేందుకు ప్రయత్నించారని స్థానికులు ఆరోపించారు. గురువారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటనతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. గుడిసెల తొలగింపును అడ్డుకునేందుకు బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం నాయకులు అక్కడికి చేరుకున్నారు. కడిపికొండ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 64, 70, 71, 72, 73లో సీలింగ్ చట్టానికి సంబంధించిన మిగులు భూముల వివరాలు ప్రభుత్వ రికార్డుల్లో ఉన్నాయని గుడిసెవాసులు పేర్కొంటున్నారు. 1997 ఫిబ్రవరి 25న అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రెవెన్యూ శాఖ జారీ చేసిన మెమో నంబర్ 11959/ఖజ.××(2)/97-1లో ఆయా సర్వే నంబర్లలోని భూముల వివరాలు, బస్ డిపో లేదా బస్‌స్టాండ్ నిర్మాణ ప్రతిపాదనలపై అప్పటి వరంగల్ జిల్లా కలెక్టర్, అర్బన్ ల్యాండ్ సీలింగ్ ప్రత్యేక అధికారి నుంచి నివేదిక కోరినట్లు తెలిపారు. ఫిబ్రవరి 26 నాటి ప్రత్యేక అధికారి కార్యాలయ పత్రాల్లో సర్వే నంబర్లు 70, 71, 72, 73లకు సంబంధించి 58,164 చదరపు మీటర్ల భూమి మిగులుగా ప్రకటించినట్లు వివరాలు ఉన్నాయని చెబుతున్నారు. కాజీపేటలో బస్‌స్టాండ్ ఏర్పాటు కోసం అప్పటి మంత్రి దాస్యం ప్రణయ్ భాస్కర్ చేసిన ప్రతిపాదన మేరకు సర్వే నంబర్లు 71, 72 పరిధిలో 22,065 చదరపు మీటర్ల భూమిని బస్ డిపో లేదా బస్‌స్టాండ్ అవసరాలకు ప్రతిపాదించినట్లు గుడిసెవాసులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఏపీఎస్ఆర్టీసీ భూసేకరణ ప్రక్రియ, సంబంధిత న్యాయస్థానాల్లో ఉన్న వ్యాజ్యాల వివరాలను పరిశీలించాలని కోరుతున్నారు. డోజర్లతో గుడిసెల తొలగింపునకు ప్రయత్నిస్తున్నారనే సమాచారం అందడంతో వివిధ రాజకీయ పార్టీల నాయకులు అక్కడికి చేరుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చినట్లు స్థానికులు తెలిపారు. భూమి వివాదంపై స్పష్టత వచ్చే వరకు తమ నివాసాలను తొలగించవద్దని గుడిసెవాసులు కోరుతున్నారు. 1997 నాటి ప్రభుత్వ మెమోలు, రెవెన్యూ రికార్డులు, సీలింగ్ భూములపై జారీ చేసిన ఉత్తర్వులు, న్యాయస్థానాల ఆదేశాలను పరిశీలించి భూముల వాస్తవ స్థితిగతులను వెల్లడించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. డోజర్లతో స్థలం చదును చేసిన ఘటనపై విచారణ జరిపించాలని, భూ వివాదం పరిష్కారమయ్యే వరకు గుడిసెవాసుల నివాసాలకు నష్టం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వైఎస్సార్ నగర్‌లో పేదల గుడిసెల కూల్చివేత దుర్మార్గం..

బాధితులకు అండగా నిలిచి పోరాడతాం..
పేదలకు హాని జరిగితే ఎమ్మెల్యే నాయిని బాధ్యత వహించాలి
స్థలంపై కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ స్పష్టత ఇవ్వాలి
బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మారెడ్డి

కాజీపేట, అక్టోబర్ 29(వాయిస్ టుడే): కాజీపేటలోని వైఎస్సార్ నగర్‌లో పేదల గుడిసెల కూల్చివేతను బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ నాయకురాలు రావు పద్మారెడ్డి తీవ్రంగా ఖండించారు. దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు న్యాయం జరిగే వరకు అండగా నిలిచి పోరాడతామని ప్రకటించారు. వైఎస్సార్ నగర్‌లో గుడిసెలు కూల్చివేస్తున్నారనే సమాచారం అందడంతో గురువారం ఆమె స్థానిక బీజేపీ నాయకులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నంలో అక్కడున్న వ్యక్తులకు, బీజేపీ నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రావు పద్మారెడ్డి మాట్లాడుతూ సుమారు 20 ఏళ్లుగా అక్కడ నివసిస్తూ జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబాలను ఒక్కసారిగా అభద్రతలోకి నెట్టడం అన్యాయమని అన్నారు. ఇళ్ల యజమానులు లేని సమయంలో గుడిసెలను కూల్చివేయడం అమానుషమని విమర్శించారు. అధికార, రాజకీయ అండదండలతోనే ఇటువంటి చర్యలు జరుగుతున్నాయన్న అనుమానాలను వ్యక్తం చేస్తూ, ఘటనపై అధికార యంత్రాంగం స్పందించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ నగర్‌లోని స్థలం ఎవరి ఆధీనంలో ఉంది? దాని స్వరూపం ఏమిటి? అనే అంశాలపై జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ స్పష్టత ఇవ్వాలని రావు పద్మారెడ్డి కోరారు. ప్రభుత్వ భూమిని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం వంటి ప్రజాప్రయోజనాల కోసమే వినియోగించాలని పేర్కొన్నారు. గుడిసెలు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయడంతోపాటు, పునరావాసం, తగిన పరిహారం అంశాలను ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. వైఎస్సార్ నగర్ నివాసులకు ఏదైనా హాని జరిగినా, అన్యాయం చోటుచేసుకున్నా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు. పేదల నివాసాలకు భద్రత కల్పించి, బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల శ్రీకాంత్ పటేల్, మామిడాల నరేందర్, నర్సింగ్ గౌడ్, భగవాన్ ఉపాధ్యాయ, శ్రావణ్ యాదవ్, శ్రీకాంత్ ముదిరాజ్, కళ్యాణ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి బండ్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

అధికారులకు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశాలు

పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్

కాజీపేట, అక్టోబర్ 29 (వాయిస్ టుడే): జిల్లా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు వడ్డేపల్లి చెరువు బండ్‌పై చేపట్టిన అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం వడ్డేపల్లి చెరువు బండ్‌పై జరుగుతున్న అభివృద్ధి పనులను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రిటైనింగ్ వాల్, గ్రిల్స్, టైల్స్, వాష్‌రూమ్‌లు, విద్యుత్ దీపాలు, పెయింటింగ్, జిమ్, కాంపౌండ్ వాల్ తదితర పనుల పురోగతిని సమీక్షించారు. బండ్ పరిసరాల్లో ఏర్పాటు చేయనున్న ఫుడ్ జోన్ల వద్ద సీటింగ్ ఏర్పాట్లు, గోడలపై పెయింటింగ్, పచ్చదనం పెంపు, పిల్లల ఆట స్థలం అభివృద్ధికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫుడ్ కోర్టులకు ఆకర్షణీయమైన రంగులు వేయించాలని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను త్వరగా సమర్పించాలని సూచించారు. బండ్ పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండేలా పచ్చదనాన్ని పెంపొందించాలని, విద్యుత్ దీపాల ఏర్పాటు సహా సంబంధిత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతను పాటిస్తూ, నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నివాస ప్రాంతంలో అక్రమ టపాసులు.!

చర్యలు పాటించకుండా భారీ మొత్తంలో నిల్వ., ఇద్దరు వ్యక్తుల అరెస్టు.

వాయిస్ టుడే న్యూస్, అక్టోబర్ 29 మేడిపల్లి: నివాస ప్రాంతంలో భారీగా అక్రమ నిల్వ ఉంచిన టపాసులు స్వాధీనం చేసుకున్న ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కాచవాని సింగారం, జయశంకర్ విగ్రహం సమీపంలోని నివాస ప్రాంతంలో ఎటువంటి భద్రతా చర్యలు పాటించకుండా భారీ మొత్తంలో టపాసులను నిల్వ ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి, పోలీస్ సిబ్బంది మరియు ఇద్దరు పంచ సాక్షులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో వివిధ రకాల టపాసులను ఎటువంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిల్వ ఉంచినట్లు గుర్తించారు.సుమారు 100 కిలోల టపాసులను, మొత్తం 58 పెట్టెలు మరియు ఇతర ప్యాకెట్లలో నిల్వ ఉంచినట్లు గుర్తించారు.ఈ ఘటనకు సంబంధించి అక్కడ ఉన్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి విచారించారు.ఏలగందుల స్వామి, తండ్రి వెంకటేష్, వయస్సు 31 సంవత్సరాలు, వృత్తి: బార్బర్, నివాసం జయశంకర్ విగ్రహం సమీపంలో, కాచవాని సింగారం.జక్కుల శ్రీనివాస్, తండ్రి మల్లేష్, వయస్సు 36 సంవత్సరాలు, వృత్తి: డ్రైవర్, నివాసం ఇంటి నం. జ1/108, దేవేందర్ నగర్ కాలనీ, ఉప్పల్.వీరిద్దరూ తగిన భద్రతా చర్యలు తీసుకోకుండా టపాసులను నిల్వ ఉంచినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో పంచ సాక్షుల సమక్షంలో పంచనామా నిర్వహించి, టపాసులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరినీ అదుపులోకి తీసుకుని, స్వాధీనం చేసుకున్న టపాసులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం మేడిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రజలకు విజ్ఞప్తి: టపాసులను నివాస ప్రాంతాల్లో అనుమతులు లేకుండా నిల్వ ఉంచడం, భద్రతా ప్రమాణాలు పాటించకుండా బాణసంచాను నిల్వ చేయడం ప్రమాదకరం. అగ్నిప్రమాదాలు మరియు ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు సంబంధిత నిబంధనలు, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి. ఇలాంటి అక్రమ నిల్వలు లేదా ప్రమాదకర కార్యకలాపాల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని మేడిపల్లి సిఐ డి. జలంధర్ రెడ్డి తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

130 యూనిట్ల రక్తం సేకరణ

తొర్రూరు, అక్టోబర్ 29 వాయిస్ టుడే : ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్త దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని రక్తదానం ప్రాణదానంతో సమానమని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్కరణ వారు స్వలభాగంగా గురువారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని లయన్స్ భవన్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. తొర్రూరు సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించిన ఈ శిబిరంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత, పౌరులు, మీడియా ప్రతినిధులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొర్రూరు సబ్ డివిజన్‌కు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ మాట్లాడుతూ, విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను, త్యాగాలను ఎప్పటికీ మరువలేమని అన్నారు. అమరవీరుల సంస్మరణలో భాగంగా ప్రతి సంవత్సరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అమరవీరుల త్యాగస్ఫూర్తిని సమాజానికి చాటిచెప్పడంతో పాటు ప్రజల్లో సేవాభావాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రక్తదానం అత్యంత గొప్ప మానవతా సేవ అని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని ఎస్పీ అన్నారు. ఆరోగ్యపరమైన అర్హతలు కలిగిన ప్రతి ఒక్కరూ వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాలని, ముఖ్యంగా యువత సామాజిక బాధ్యతతో ఇటువంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలకు పౌరులు, యువత, మీడియా ప్రతినిధుల నుంచి లభిస్తున్న స్పందన అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ పోలీస్ శాఖ తరఫున కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. ఈ మెగా రక్తదాన శిబిరానికి అవసరమైన సహకారం, సదుపాయాలను అందించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వరంగల్ , లయన్స్ క్లబ్, తొర్రూరు; అమ్మ హాస్పిటల్, తొర్రూరు ప్రతినిధులను జిల్లా ఎస్పీ అభినందించారు. కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేసిన తొర్రూరు సబ్ డివిజన్ పోలీస్ అధికారులను, సిబ్బందిని ప్రశంసించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ మెగా రక్తదాన శిబిరం ద్వారా 120 యూనిట్ల రక్తాన్ని సేకరించడం విశేషం. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడటమే కాకుండా సమాజంలో మానవతా విలువలను పెంపొందించవచ్చని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ డిఎస్పి కృష్ణ కిషోర్, సిఐ గణేష్ , ఎస్సై మహేందర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుబాయిలో బతుకమ్మ & దసరా సంబరాలు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 29(వాయిస్ టుడే) : ప్రభుత్వ బాషా సంస్కృతిక శాఖ సౌజన్యం తో మార్మోగిన బతుకమ్మ ఆటా పాట.మాట పాటలతో దుమ్ములేపిన దరువు ఎల్లన్న దుబాయ్ లోని "వుడ్ లెం" స్కూల్ ఆవరణలో తెలంగాణ ఆడబిడ్డలు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు, పెద్ద ఎత్తున బతుకమ్మ ను పేర్చి పల్లెపాటలు ఆలపించారు..తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచనల మేరకు ఎన్నారై అడ్వైజర్ బోర్డు మెంబర్ నంగి దేవేందర్ రెడ్డి సారాధ్యంలో మరియు ఎన్ఆర్ఐ అడ్వైజర్ బోర్డు మెంబర్ సత్యం గౌడ్ పర్యవేక్షణలో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బాలరాజ్ గౌడ్ నేతృత్వంలో దుబాయ్ లో బతుకమ్మ పండుగ మరియు దసరా పండుగలు అంగరంగ వైభవంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఉమెన్ కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద , మాజీ ఉమెన్ కోపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి , తెలంగాణ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎర్రబెల్లి స్వర్ణ, న్ ఆర్ ఐ అడ్వైసరి బోర్డు మెంబెర్ నంగి దేవేందర్ రెడ్డి మరియు బాషా సాంస్కృతిక శాఖ ప్రభుత్వ సలహా మండలి సభ్యులు డా. దరువు ఎల్లన్న పాల్గొన్నారు,దుమ్ము లేపిన ఆట పాటలు డా దరువు ఎల్లన్న (బాషా సంస్కృతిక శాఖ సలహామండలి సభ్యులు) సాంస్కృతిక సారధి కళాకారులు,మా పల్లె శంకర్, సోని యాదర్ల, సోని పటేల్ తదితరులు పాల్గొని కన్నుల పండుగలాగా సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు, ఆట పాటలతో వేదిక కొత్త వన్నె సంతరించుకుంది.. ఒగ్గు డోలు చెప్పుళ్లతో.. డప్పుల దరువులతో సభా ప్రాంగానం అంత మారుమోగిపోయింది.చెప్పట్లతో బతుకమ్మలు ఆడుతు ఆడ పడుచులు సంబురపడ్డారు..ఈ కార్యక్రమానికి దుబాయి కాన్సిలెట్ జనరల్ అంకిత వాక్కెకర్ ,ప్రత్యేక ఆహ్వానితురాలుగా పాల్గొని బతుకమ్మ ఆడుతు... మురిసిపోయారు ఆకట్టుకున్న అతిథుల ప్రసంగాలు తెలంగాణ నుండి ముఖ్య అతిథి పాల్గొన్న నేరెళ్ల శారద గారు మాట్లాడుతూ.. ప్రపంచంలో అన్ని దేవుళ్ళను పువ్వులతో కొలిస్తే పువ్వులని దేవుళ్ళుగా కొలిచే గొప్ప సంస్కృతి తెలంగాణకే దక్కిందని, ఉన్న ఊరును వదిలేసి దుబాయ్ కి వచ్చిన బిడ్డలందరూ వారి సొంత సంస్కృతిని సాంప్రదాయాలను మరచిపోకుండా బతుకమ్మ పండుగను ఇంత ఘనంగా నిర్వహించడం మాటల్లో చెప్పలేని ఆనందం కలుగుతుందని కార్యక్రమాన్ని నిర్వాహకులను కొనియాడారు. బండ్రు శోభారాణి మాట్లాడుతూ ఉద్యమాల గడ్డ తెలంగాణ నుండి పొట్ట చేత పట్టుకొని వచ్చిన బిడ్డలు ఇవాళ గొప్ప స్థాయిలో ఎదిగి తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను విస్తరింప చేయడంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నందుకు గర్వంగా ఉందని తెలియజేశారు, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ మొదటిసారి నేను విదేశాల్లో బతుకమ్మకు హాజరు కావడం కానీ ఇది విదేశాల్లో జరుగుతున్నట్టు లేదు తెలంగాణ గడ్డమీదనే బతుకమ్మ సంబరాలు జరుగుతున్నంత ఆనందంగా ఉందని తెలియజేశారు, ఎన్ఆర్ఐ అడ్వైజరీ బోర్డు మెంబర్ నంగి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గల్ఫ్ కార్మికుల కష్టాలు కన్నీళ్లు గత కొన్ని సంవత్సరాలుగా నాకు స్వయంగా తెలుసు అంటూ వారి కష్టాలను చూసి కన్నీళ్లను తుడిచే నాయకుడిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజా ప్రభుత్వం దుబాయ్ లో ఉంటున్న తెలంగాణ బిడ్డలు దురదృష్టవశాత్తు ఎవరు చనిపోయిన వారి కుటుంబాలకు 5 లక్షల రూపాయల మృత ధన సహాయాన్ని అందించడం గర్వకారణం అని నంగి దేవేందర్ రెడ్డి తెలియజేశారు అతి త్వరలో ఎన్నారైల కోసం గల్ఫ్ కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేసే ప్రక్రియ వేగవంతం చేస్తున్నట్టు ఆయన తెలియజేశారు, ఈ కార్యక్రమంలో కవి గాయకుడు ఉస్మానియా విద్యార్థి ఉద్యమ నాయకుడు, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ ప్రభుత్వ సలహా మండలి సభ్యులు డాక్టర్ దరువు ఎల్లన్న మాట్లాడుతూ నాడు వలస కార్మికులు నేడు ప్రవాస భారతీయులు అని తెలంగాణ రాకముందు గల్ఫ్ కార్మికులు పడిన కష్టాల గురించి తాను రాసిన పాట ను పాడి వినిపించి భావోద్వేగానికి గురయ్యారు, ఇప్పుడిప్పుడే తెలంగాణ బిడ్డలు వ్యాపారవేత్తలుగా కంపెనీ యజమానులుగా న్యూ ఎంటర్ప్రెన్యూర్లుగా మారడం రాష్ట్రానికి తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని గల్ఫ్ ప్రవాస భారతీయులను కొనియాడారు. దరువు ఎల్లన్న తన మాట పాటతో దుబాయ్ లో ఉంటున్న వారిని వారి సొంత ఇండ్లలో బతుకమ్మ ఆడుకుంటున్న ఆనందాన్ని కల్పించారు, సత్యం గౌడ్ మాట్లాడుతూ దుబాయ్ లో ఉంటున్న తెలంగాణ బిడ్డలందరికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున మేము అండగా ఉంటామని ఎవరికి ఏ కష్టం వచ్చినా మమ్మల్ని సంప్రదించవచ్చని గల్ఫ్ కార్మికులకు ప్రవాస తెలంగాణ బిడ్డలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దుబాయ్ లో తెలంగాణ ప్రముఖులు తోట రామ్ కుమార్ , రామచంద్ర రెడ్డి రాధారపు సత్యం , ప్రియా సింగి రెడ్డి , హకీమ్ , రాజా శ్రీనివాస్ , సురేంద్ర పటేల్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ దసరా ఉత్సవాలని ఘనంగా నిర్వహించారు.

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 29(వాయిస్ టుడే) : హృదయపూర్వక ధన్యవాదాలు నా జన్మదినం సందర్భంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా, ఫోన్ ద్వారా, సామాజిక మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు తెలియజేసిన ప్రజాప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, యువతకు, బంధువులకు, ప్రజలకు పేరుపేరునా నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీ అందరి అభిమానం, ఆదరణ, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.మీ అభిమానం, ఆశీస్సులే నాకు కొండంత బలం. నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం.

ఈటల రాజేందర్ మూడవ మహాపాదయాత్రలో పాల్గొన్న జె కె శేఖర్ యాదవ్

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 29(వాయిస్ టుడే) జవర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేయాలని ఎంపీ ఈటెల రాజేందర్ చేస్తున్న మూడవరోజు మహాపాదయాత్రలో పాల్గొనడానికి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు జెకె శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి భారీ ఎత్తున తరలి వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టేట్ మున్సిపల్ సెల్ కో కన్వీనర్ రావుల శేషగిరి , రాష్ట్ర ఐటీ సెల్ కన్వర్ కరుణ , సిద్ధిరాం రెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు ఏం శ్రీనివాస్ యాదగిరి మల్లేష్ విద్యాసాగర్, శ్రీధర్ వర్మ రమేష్ , రమేష్ యాదవ్ , అనురాధ అసెంబ్లీ కన్వీనర్లు శ్రీనివాస్ గౌడ్ వినోద్ వినోద్, దేవి ,కుమార్ రేణుక సబితా యాదవ్ తేజస్విని శ్రీకాంత్ యాదవ్ మరియు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి జశ్వితకు ఎంపీ వద్దిరాజు ఆశీస్సులు

ఖమ్మం, అక్టోబరు 29 (వాయిస్ టుడే): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర చిన్నారి జశ్వితకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. ప్రముఖ వ్యాపారవేత్త ఇనుగుర్తి వెంకటేశ్వర్లు మనుమరాలు, వంశీకృష్ణ--శృతి దంపతుల కుమార్తె జశ్విత మొదటి పుట్టినరోజు వేడుకలు గురువారం రాత్రి ఖమ్మం సమీపంలోని లక్ష్మీపురం వద్ద సూర్య ఆగ్రో ఫామ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ నాయకుడు పగడాల నాగరాజు తదితరులు హాజరయ్యారు. చిన్నారి జశ్వితకు అక్షింతలు వేసి ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎన్టీఆర్ స్టేడియంలో సదర్ ఉత్సవాలకు కూన శ్రీశైలం గౌడ్ ఆహ్వానం

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 29(వాయిస్ టుడే) : వచ్చే నెల 4న ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న శ్రీ కృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవాలకు హాజరుకావాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ఆహ్వానించారు. ఈ మేరకు మినిస్టర్ క్వార్టర్స్‌లో శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కలిసి ఉత్సవ కమిటీ ప్రతినిధులు కూన శ్రీశైలం గౌడ్ కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ కుమారుడు అరవింద్ యాదవ్, గౌరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ నాలుగో ఫేజ్ పార్కుల దుస్థితిపై జనసేన నాయకుల వినతి

పార్కుల నిర్వహణపై నిర్లక్ష్యం వీడాలి.. పాముల బెడద, అపరిశుభ్రతను తక్షణమే తొలగించాలి

కూకట్‌పల్లి: అక్టోబర్ 29(వాయిస్ టుడే) కేపీహెచ్‌బీ నాలుగో ఫేజ్‌లోని పార్కులు సరైన నిర్వహణ లేక అధ్వానంగా మారాయని, పార్కుల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జనసేన పార్టీ నాయకులు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్కుల్లో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు చెత్తాచెదారం పేరుకుపోయి పారిశుద్ధ్యం పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. పిచ్చిమొక్కల కారణంగా పాముల సంచారం పెరిగి, రాత్రి వేళల్లోనే కాకుండా పగటిపూట కూడా పాములు కాలనీల్లోని ఇళ్లలోకి వస్తున్నాయని పేర్కొన్నారు. దీంతో స్థానికులు, ముఖ్యంగా చిన్నపిల్లల తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని వివరించారు. అలాగే, పార్కులపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు, మద్యం సేవించే వారికి అడ్డాలుగా మారుతున్నాయని కాలనీవాసులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు నాయకులు తెలిపారు. ప్రజల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే స్పందించాలని, పార్కుల్లో పిచ్చిమొక్కలను తొలగించి, చెత్తాచెదారాన్ని శుభ్రం చేయడంతో పాటు పాముల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. పార్కుల నిర్వహణను క్రమం తప్పకుండా పర్యవేక్షించి, స్థానికులకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.జనసేన నాయకులు వివరించిన సమస్యలను జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ సానుకూలంగా స్వీకరించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, ఆళ్ల నరేంద్ర, పోలేబోయిన శ్రీనివాస్ గోవిందా, పి. గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు ఏఐవైఎఫ్ ప్రత్యేక కార్యక్రమం

ప్రజాస్వామ్య పరిరక్షణలో యువత ముందడుగు: జీ. దామోదర్‌రెడ్డి

నాచారం (వాయిస్ టుడే): పట్టభద్రుల గొంతుక శాసనమండలిలో బలంగా వినిపించాలంటే అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జీ. దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఈసీఐఎల్‌లోని కమలానగర్‌లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు సహాయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టభద్రులకు ఫారం--18 ప్రతులను అందజేశారు.ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, విద్యారంగ సమస్యలు, యువత భవిష్యత్తు వంటి అంశాలపై తమ గళాన్ని వినిపించేందుకు పట్టభద్రుల ఓటు కీలకమన్నారు. ఓటు హక్కు కేవలం హక్కు మాత్రమే కాదని, అది సామాజిక బాధ్యత కూడా అని పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులు అవసరమైన పత్రాలతో ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ఇప్పటికే నమోదైన వారు సైతం తమ ఓటరు నమోదు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు కల్లూరు ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు గిరిబాబు, శేఖర్, సతీష్‌తో పాటు పట్టభద్రులు సుదర్శన్, అశోక్, సుధీప్, మధు, రవి, రమ్య, కీర్తన, రామారావు, బాషా, తిరుపతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ ఓ యూ లో పెన్‌డౌన్-టూల్‌డౌన్..

సికింద్రాబాద్, అక్టోబర్ 29 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పెన్‌డౌన్--టూల్‌డౌన్ సహాయ నిరాకరణ కార్యక్రమం రెండో రోజు గురువారం విజయవంతంగా కొనసాగింది. మొదటిరోజు కంటే అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని తమ ఐక్యతను చాటారు. యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, ఎగ్జామినేషన్ బ్రాంచ్, వివిధ పరిపాలనా విభాగాలు, క్యాంపస్, అనుబంధ కళాశాలలు, కామర్స్ కళాశాలలు, జిల్లా పీజీ కళాశాలలో నిరసనలు నిర్వహించారు. ఉద్యోగులకు వర్తించే పెన్షన్ విధానంపై స్పష్టత ఇవ్వడంతో పాటు టైమ్ స్కేల్ ఉద్యోగుల ఈపీఎఫ్ బకాయిలు చెల్లించాలని, 2023 నుంచి నిలిచిపోయిన రిటైర్మెంట్ ప్రయోజనాలను పునరుద్ధరించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఏప్రిల్ 2023 నుంచి నిలిచిపోయిన కాంట్రాక్ట్ ఉద్యోగుల రూ.1,500 వార్షిక ఇంక్రిమెంట్‌ను బకాయిలతో సహా చెల్లించాలని, సుమారు 25 ఏళ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది రెగ్యులరైజేషన్‌కు ప్రభుత్వానికి సిఫార్సులు పంపాలని కోరారు. కోర్టు ఆదేశాల మేరకు అనెక్సర్--1, అనెక్సర్--2 వివరాలను అక్టోబర్ 31లోగా ప్రభుత్వానికి సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలపై యూనివర్సిటీ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ కుమార్, ఆరు ఉద్యోగ సంఘాల నాయకులు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఓయూ పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

సికింద్రాబాద్, అక్టోబర్ 29 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రజల భద్రతకే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పోలీసులు భాగస్వాములవుతూ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర సమయాల్లో రక్తం అందించి ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రక్షిత మూర్తి, అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీ జగన్, సీఐ దాస్, ఎస్ఐ కావ్యతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. తార్నాకకు చెందిన బీజేపీ నాయకులు సైతం శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. మహంకాళి జిల్లా ఇంటలెక్చువల్ సెల్ కన్వీనర్ శ్రీరామ్ వెంకట్, బీజేపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు కరుణాకర్, గీత సెల్ కన్వీనర్ కృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

281వ డివిజన్ రంగారెడ్డి నగర్‌లో గృహప్రవేశ వేడుకకు హాజరైన కొలన్ హన్మంత్‌రెడ్డి

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 29(వాయిస్ టుడే) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 281వ డివిజన్ రంగారెడ్డి నగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రెడ్డి గృహప్రవేశ వేడుకకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 281వ డివిజన్ అధ్యక్షులు జలీల్ ఖాన్, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, పంచశీల కాలనీ అధ్యక్షులు సుబ్బారెడ్డి, రాహుల్ ప్రియాంక గాంధీ సేన (కాంగ్రెస్) జిల్లా అధ్యక్షులు శ్యామ్ సుందర్, బీసీ సెల్ డివిజన్ అధ్యక్షులు ఎల్. రవి గౌడ్, కాంగ్రెస్ నాయకులు విజయ్ సాగర్, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు భవనానికి మరో రూ.5 కోట్లు!

త్వరగా నిర్మాణాలు చేపట్టాలి..
అదనపు నిధులు కేటాయిస్తాం: మంత్రి పొన్నం

యువతకు నైపుణ్య శిక్షణ,
స్వయం ఉపాధిపై ప్రత్యేక కార్యాచరణ

సంపన్నులు పేదల విద్య, ఉద్యోగాభివృద్ధికి తోడ్పడాలి..
కులస్తులూ విరాళాలు అందించాలి: ఆది శ్రీనివాస్

హైదరాబాద్, అక్టోబరు 29 (వాయిస్ టుడే): కోకాపేటలో నిర్మించనున్న మున్నూరు కాపు ఆత్మగౌరవ భవనానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.5 కోట్లు కేటాయించిందని, నిర్మాణ పనులు త్వరగా ప్రారంభిస్తే మరో రూ.5 కోట్లు మంజూరు చేస్తామని బీసీ సంక్షేమ, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆయా సామాజిక వర్గాల్లో సంపన్నులుగా ఎదిగిన వారు కుల భవనాల నిర్మాణంతో పాటు పేదల విద్య, ఉద్యోగాభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. మున్నూరు కాపు ఆత్మగౌరవ భవనానికి రూ.5 కోట్లు కేటాయించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమం గురువారం జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే, ఎంపీ కాలనీ క్లబ్‌లో నిర్వహించారు. మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై నిధుల కేటాయింపునకు సంబంధించిన ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కులంలో ఐక్యతతో పాటు సామాజిక బాధ్యత కూడా ఉండాలని అన్నారు. ఉన్నత స్థాయికి చేరుకున్నవారు తమ సామాజిక వర్గంలోని పేద విద్యార్థులు, నిరుద్యోగుల అభ్యున్నతికి తోడ్పడాలని సూచించారు. మున్నూరు కాపు ఆత్మగౌరవ భవన నిర్మాణాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని, పనుల పురోగతిని బట్టి అదనంగా మరో రూ.5 కోట్లు కేటాయిస్తామని తెలిపారు. అదనపు నిధుల కేటాయింపుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని పేర్కొన్నారు.

కులవృత్తుల్లో కాలానుగుణ మార్పులు రావాలి

మారుతున్న కాలానికి అనుగుణంగా కులవృత్తుల్లోనూ మార్పులు రావాలని, యువత ఆధునిక నైపుణ్యాలను అలవర్చుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని మంత్రి సూచించారు. మున్నూరు కాపు కార్పొరేషన్ ద్వారా యువతకు వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. స్వయం ఉపాధి శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలను మెరుగుపరిచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. త్వరలో ప్రారంభం కానున్న రాజీవ్ యువ వికాసం పథకాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో కులగణన నిర్వహించామని, జనాభాకు సంబంధించిన ప్రామాణిక గణాంకాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కులగణన నివేదిక ఆధారంగా సామాజిక పరిస్థితులను విశ్లేషించి అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన కుటుంబాలు ఆర్థికంగా మెరుగైన స్థితికి చేరుకుంటున్నాయని పేర్కొన్నారు. గుజరాత్‌లోని పాటిదార్ భవన్‌లో యువతకు నాణ్యమైన శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న విధానాన్ని ప్రస్తావించారు. తెలంగాణలో బీసీ స్టడీ సర్కిళ్లలోనూ సంస్కరణలు చేపడుతున్నామని, మున్నూరు కాపు విద్యార్థులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో యువతకు విద్యే కీలక పెట్టుబడి అని పేర్కొన్నారు.

నిర్మాణానికి కులబాంధవులూ సహకరించాలి

ప్రభుత్వ చీఫ్ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. మున్నూరు కాపు కుల పెద్దలంతా ఐక్యంగా ఉండి ఆత్మగౌరవ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో పాటు కులబాంధవులు కూడా విరాళాలు అందించి నిర్మాణంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి దానం నాగేందర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆత్మగౌరవ భవనానికి రూ.20 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్‌పర్సన్ బాలలక్ష్మి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఆర్టీసీ చైర్మన్ సోమవారం సత్యనారాయణ, డాక్టర్ పుంజాల వినయ్‌కుమార్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తమరావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు గాలి అనిల్‌కుమార్, రౌతు కనకయ్య, మంగళారపు లక్ష్మణ్, సత్తు మల్లేశం, గ్లోబల్ మున్నూరు కాపు అడ్వైజర్ సంఘాని రజనీకాంత్, బుక్క వేణుగోపాల్, జె.ఎన్. వెంకట్, మిద్దెల జితేందర్, మణికొండ వెంకటేశ్వరరావు, ఎడ్ల రవి, బండి పద్మ, ఈసంపల్లి వెంకన్న, కె.ఎస్. ఆనంద్ తదితరులు, వివిధ సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదులో ఎంపీ వద్దిరాజు లక్ష్మీదేవిపల్లిలో ఇంటింటికీ వెళ్లి ఫారం-18 అందజేత

కొత్తగూడెం, అక్టోబరు 29 (వాయిస్ టుడే): నల్లగొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల నమోదు ప్రక్రియను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ముమ్మరం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలో గురువారం ఆయన స్వయంగా పట్టభద్రులను కలిసి ఓటర్లుగా నమోదు చేయించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న ఎంపీ రవిచంద్ర.. లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం స్టేజీ వద్ద ఇంటింటికీ తిరిగి పట్టభద్రులను కలిశారు. అర్హులైన పట్టభద్రులైన గృహిణులకు ఎన్నికల సంఘం నిర్దేశించిన ఫారం-18ను అందించి, వివరాలు నమోదు చేయించారు. పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకుని ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొట్టి వెంకటేశ్వరరావు, భద్రు, బాలు, శ్రీను, రమేష్, గోపాల్, రాము, కన్ని, శివ తదితరులు పాల్గొన్నారు.

సగర (ఉప్పర) కులాన్ని బీసీ గ్రూప్ మార్పు అధ్యయనంలో చేర్చినందుకు బీసీ కమిషన్‌కు కృతజ్ఞతలు

ఖైరతాబాద్, అక్టోబర్ 29: తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్, సగర (ఉప్పర) కులాల గ్రూప్ మార్పు అంశంపై రాష్ట్ర బీసీ కమిషన్ సమగ్ర అధ్యయనం చేపట్టడం పట్ల సగర (ఉప్పర) కుల సంఘాల నాయకులు, పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. సగర (ఉప్పర) కులాన్ని బీసీ-డీ నుంచి బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలని సుదీర్ఘకాలంగా చేస్తున్న వినతులను కమిషన్ పరిశీలనలోకి తీసుకోవడంపై ధన్యవాదాలు తెలిపారు. ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అధ్యక్షతన ఇటీవల నిర్వహించిన సమావేశంలో... సగర కుల గ్రూప్ మార్పు అంశాన్ని సమగ్ర నివేదికలు, క్షేత్రస్థాయి అధ్యయనాల ఆధారంగా పరిశీలించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సగర (ఉప్పర) హక్కుల పోరాట సమితి ఆద్వర్యంలో.. సగర కుల పెద్దలు బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, ఇతర సభ్యులను కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సగర (ఉప్పర) కులస్తుల సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసి తమ కులానికి తగిన న్యాయం చేయాలని కోరారు. అన్ని రకాల ఆధారాలను పరిశీలించి, బీసీ-డీ నుండి బీసీ-ఏ గ్రూప్‌లోకి మారుస్తూ సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీసీ కమిషన్ చేపట్టిన ఈ అధ్యయనం సగర కుల ప్రజల ఆశలకు, హక్కుల సాధనకు దోహదపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కమిషన్ చైర్మన్‌ను కలిసిన వారిలో సగర కుల నాయకులు అజ్జకోలు హరీష్ సాగర్, నీరడి భూపేష్ సాగర్, బంగారు నరసింహ సాగర్, దిండి రామస్వామి, గోపాల్ సాగర్ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ భారత్ అభియాన్, యువ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మాధవరం కాంతారావు

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.. దేశ రక్షణకు యువత అండగా నిలవాలి

కూకట్‌పల్లి: అక్టోబర్ 29(వాయిస్ టుడే) యువతలో సామాజిక బాధ్యత, దేశభక్తి, ప్రజా చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో అక్టోబర్ 31న నిర్వహించనున్న స్వచ్ఛ భారత్ అభియాన్, యువ భారత్ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను మాధవరం కాంతారావు ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా కేవలం పరిసరాల పరిశుభ్రతకే పరిమితం కాకుండా, సమాజ శ్రేయస్సుకు దోహదపడే పలు కీలక అంశాలపై యువతకు అవగాహన కల్పించనున్నారు. ఇందులో భాగంగా డ్రగ్స్‌కు దూరంగా ఉండటం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, దేశ సరిహద్దులను కాపాడుతున్న సైనికులకు అండగా నిలవడం వంటి అంశాలను ప్రచారంలో ప్రధానంగా చేర్చారు. ఈ సందర్భంగా మాధవరం కాంతారావు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ భారత్ అంటే కేవలం వీధులను శుభ్రం చేయడమే కాదని, సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల సమస్యపై పోరాడటం, ట్రాఫిక్ నిబంధనలను బాధ్యతాయుతంగా పాటించి ప్రమాదాలను నివారించడం కూడా పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగమని పేర్కొన్నారు. అలాగే, దేశ సరిహద్దుల్లో నిరంతరం విధులు నిర్వహిస్తూ దేశ భద్రతకు పాటుపడుతున్న సైనికుల సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, దేశ రక్షణ పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా సమాజ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని అన్నారు. స్వచ్ఛత, మాదకద్రవ్యాల నివారణ, రహదారి భద్రత, దేశభక్తి వంటి అంశాలపై యువతను చైతన్యపరిచే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాధవరం కాంతారావు పిలుపునిచ్చారు.

ముదిగొండ మట్టికి గర్వకారణం

మహిళా రైతు కొమ్మూరి స్వాతికి కిసాన్ మహారాజ్ పురస్కారం

హైదరాబాద్‌లో ప్రఖ్యాత రైతు శాస్త్రవేత్త, పద్మశ్రీ, డాక్టర్ చింతల వెంకటరెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్న స్వాతి

ముదిగొండ మండలం అక్టోబర్ 29 వాయిస్ టుడే : ఖమ్మం జిల్లా ముదిగొండకు చెందిన మహిళా రైతు కొమ్మూరి స్వాతి వ్యవసాయ రంగంలో అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపు లభించింది. గురువారం హైదరాబాద్ మాదాపూర్‌లోని హైటెక్స్ సిటీ శిల్పకళా వేదికలో ఔ×ూజు ఎఎ డ వీఎ ఎఱశ్రీశ్రీఘస్త్రవ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తన భర్త కొమ్మూరి రమేష్‌తో కలిసి ప్రతిష్ఠాత్మక కిసాన్ మహరాజ్ పురస్కారం అందుకుంది. ప్రముఖ అంతర్జాతీయ స్వతంత్ర వ్యవసాయ శాస్త్రవేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ చింతల వెంకటరెడ్డి చేతుల మీదుగా కిసాన్ మహారాజ్ అవార్డుతోపాటు 5 వేల రూపాయల నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ ఎంపీలు విజయసాయి రెడ్డి, రంజిత్‌రెడ్డి, ప్రఖ్యాత రైతు శాస్త్రవేత్త చింతల వెంకటరెడ్డి, తెలంగాణ కమ్మ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ తదితరులు హాజరయ్యారు. ముఖ్యంగా సహజ వ్యవసాయంలో తనదైన ముద్ర వేస్తూ నేలతల్లిని కాపాడుతూ ప్రకృతితో మమేకమై సేద్యం సాగిస్తున్న స్వాతి ప్రస్థానం ఎందరో మహిళా రైతులకు స్ఫూర్తిదాయకం. రైతు చెమట చుక్కే ప్రపంచానికి అన్నం పెట్టే అమృతధార. రైతు పండించే ప్రతి గింజలో శ్రమ ఉంది... త్యాగం ఉంది... కోట్లాది ప్రజల ఆకలి తీర్చే మహోన్నత సేవ ఉంది. అందుకే ప్రపంచానికి ఆహారమందించే రైతులే నిజమైన మహారాజులు. ముదిగొండ కీర్తిని మరింత ఇనుమడింపజేస్తూ మహిళా రైతుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్న కొమ్మూరి స్వాతికి ఈ పురస్కారం మరిన్ని విజయాలకు నాంది కావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాం. భాగ్యనగరం వేదికగా కిసాన్ మహరాజ్ ఉత్తమ రైతు మహిళా పురస్కారం అందుకోవడం చాలా సంతోషంగా ఉందని స్వాతి సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా తన వంతు వ్యవసాయ రంగంలో యువతకు శిక్షణ, తర్ఫీదు వంటి అంశాల్లో తన భర్త సహకారంతో కృషి చేస్తానని ఆమె భరోసా ఇచ్చారు.

గుజ్జ సత్యంకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఇవ్వాలి

సామాజిక, చేనేత, విద్యా, వైద్య రంగాల ప్రతినిధుల విజ్ఞప్తి

రాష్ట్ర ప్రభుత్వానికి పలు జిల్లాల నుంచి మద్దతు తీర్మానాలు

హైదరాబాద్, అక్టోబర్ 29: బీసీ హక్కుల సాధన, సామాజిక న్యాయం, విద్యారంగ అభివృద్ధి, చేనేత కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న గుజ్జ సత్యం (గుజ్జ సత్యనారాయణ)కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని పలు సామాజిక వర్గాలు, చేనేత, బీసీ సంఘాలు, విద్యా మరియు వైద్య రంగాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాజ్యాంగ నిబంధనలు, అర్హతలకు అనుగుణంగా ఆయన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్ కాచిగూడలోని హోటల్ మహారాజాలో 'చేనేత వర్గాల చైతన్య వేదిక' జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ డిమాండ్‌ను ప్రముఖంగా ప్రస్తావించారు.

అన్ని వర్గాల నుంచి వెల్లువెత్తుతున్న మద్దతు

చేనేత కార్మికులు, పద్మశాలి సమాజం, బీసీ సంఘాలు మరియు పాఠశాలల యాజమాన్యాల సమస్యలను శాసనమండలి వేదికగా వినిపించేందుకు తగిన ప్రాతినిధ్యం అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణలోని ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై పోరాడుతున్న 'బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ' (దీూహీూ)తో పాటు వివిధ జిల్లాలకు చెందిన బీసీ, ప్రజాసంఘాలు గుజ్జ సత్యం అభ్యర్థిత్వానికి మద్దతుగా తీర్మానాలు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

సేవా దృక్పథానికి దక్కిన గుర్తింపు

విద్యారంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన గుజ్జ సత్యం ప్రైవేట్ పాఠశాలల సమస్యలు, ఉపాధ్యాయుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందేలా విశేష కృషి చేశారని నాయకులు కొనియాడారు. అలాగే, చేనేత రంగానికి చెందిన వేలాది కుటుంబాల ఉపాధి, మార్కెటింగ్, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై ఆయనకున్న అవగాహన మండలికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇది కేవలం ఒక వ్యక్తికి పదవి ఇచ్చే అంశం కాదని, వివిధ సామాజిక, వృత్తి ధర్మాల సమస్యలకు ప్రాతినిధ్యం కల్పించే దిశగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

ఈ కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ది జగదీశ్, కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ కోశాధికారి పుట్టబత్తిని జ్ఞానేశ్వర్, పద్మశాలి నాయకులు జిల్లా నరేంద్ర, వంగాల బాలరాజ్, గంజి వెంకటేశం, వెంకట్రామయ్య, రాజు పాల్గొన్నారు. సోషలిస్ట్ పార్టీ జాతీయ కార్యదర్శి కేవీ గౌడ్, బీసీ మహిళా నాయకురాలు సోమకవిత తదితరులు హాజరై గుజ్జ సత్యం ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి పూర్తి మద్దతు తెలిపారు.

బోడుప్పల్ శ్రీచైతన్య హాస్టల్‌లో విద్యార్థుల మధ్య ఘర్షణ

తలకు తీవ్ర గాయాలతో ఐసీయూలో విద్యార్థి
యాజమాన్యం నిర్లక్ష్యంపై ఆరోపణలు..
కళాశాలను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్

వాయిస్ టుడే న్యూస్ -- బోడుప్పల్, అక్టోబర్ 29: బోడుప్పల్‌లోని శ్రీచైతన్య కళాశాల హాస్టల్‌లో విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఈ ఘటనలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 17 ఏళ్ల కె. అనుదీప్ తీవ్రంగా గాయపడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విద్యార్థి భద్రత విషయంలో కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన అనుదీప్ బుధవారం రాత్రి హాస్టల్‌లో మరో ముగ్గురు విద్యార్థులతో జరిగిన ఘర్షణలో గాయపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో స్పృహ కోల్పోయి కిందపడిపోయినట్లు పేర్కొన్నారు. అనంతరం అతడిని సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

ఘటనపై పోలీసుల విచారణ

ఘటనపై సమాచారం అందుకున్న మేడిపల్లి పోలీసులు విచారణ చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నామని మేడిపల్లి సీఐ డి. జలంధర్‌రెడ్డి తెలిపారు. ఘర్షణకు దారితీసిన కారణాలు, ఘటనలో ఎవరి పాత్ర ఎంత ఉందనే అంశాలపై విచారణ అనంతరం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తమ కుమారుడికి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనకు గల కారణాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కళాశాల యాజమాన్యం వ్యవహారశైలిపైనా సమగ్ర విచారణ జరపాలని వారు కోరుతున్నారు. తమ కుమారుడి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి సమాచారం అందించాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది.

కళాశాలను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్

ఈ ఘటనను ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జానపాటి రాము యాదవ్, నవీన్ శగంటి, రాజేష్ తదితరులు ఖండించారు. బాధిత విద్యార్థికి అండగా నిలుస్తామని పేర్కొంటూ హాస్టల్ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో కళాశాల యాజమాన్యం బాధ్యత వహించాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని, విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యం వహించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కళాశాలను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. హాస్టళ్లలో విద్యార్థుల భద్రత, పర్యవేక్షణపై ఈ ఘటన మరోసారి ఆందోళన రేకెత్తించింది. అయితే, ఘర్షణకు గల కారణాలు, యాజమాన్యం పాత్రపై పోలీసుల విచారణలో వెల్లడయ్యే వివరాలు కీలకం కానున్నాయి.

ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

న్యాల్కల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడలుకొత్తపల్లి భాస్కర్ రెడ్డి

జహీరాబాద్,వాయిస్ టుడే అక్టోబర్ 29 : భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కుల్లో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ఓటు హక్కును పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని న్యాల్కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుకొత్తపల్లి భాస్కర్ రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ద్వారా ప్రజలు తమ సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారాల కోసం కృషి చేయవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడికి రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందని తెలిపారు. అలాంటి కీలకమైన హక్కుకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఉన్న లోటుపాట్లను కాంగ్రెస్ పార్టీ ఎత్తిచూపుతూ పోరాటాలు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళనలు, పోరాటాల నేపథ్యంలోనే ఎస్ఐఆర్ ప్రక్రియలో పలు మినహాయింపులు కల్పించారని ఆయన పేర్కొన్నారు. ఓటు హక్కును పరిరక్షించడంతో పాటు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిగా రద్దు చేయాలనే డిమాండ్‌తో నవంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాస్వామ్య పరిరక్షణను కోరుకునే ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కొత్తపల్లి భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు.

పెద్దమ్మ తల్లికి ఘనంగా సువర్ణ పుష్పార్చన

పాల్వంచ, అక్టోబర్ 29: (వాయిస్ టుడే) : పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం గ్రామంలోని శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మ గుడి)లో గురువారం అమ్మవారికి ఘనంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. గురువారాన్ని పురస్కరించుకొని అమ్మవారికి 108 సువర్ణ పుష్పములతో వైభవంగా పుష్పార్చన చేశారు. అమ్మవారికి హారతి, మంత్రపుష్పం, నివేదన తదితర ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఏ.విజయ్ కుమార్, భక్తులు, అర్చకులు ప్రసాద్ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చియ్యవరంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి విస్తృత ప్రచారం

శ్రీకాళహస్తి(వాయిస్ టుడే)అక్టోబర్ 29 : గ్రామ సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు శ్రీకాళహస్తి త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామంలో గురువారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ తిరుపతి జిల్లా ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు నూక బాలాజీతో కలిసి గ్రామంలో పర్యటించి ప్రజలను కలుసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో స్థానిక ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్వయంగా గ్రామంలో పర్యటించి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కూటమి పాలనలో గ్రామాల అభివృద్ధి అనంతరం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు నూక బాలాజీ మాట్లాడుతూ,కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని వారు విమర్శించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు స్థానిక సంస్థల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ మొదటి నుంచీ కట్టుబడి ఉందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ద్వారానే రాష్ట్రం మరింత పురోగతి సాధిస్తుందని పేర్కొన్నారు.కూటమి అభ్యర్థులకు మద్దతివ్వాలని విజ్ఞప్తి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇప్పటికే పలు స్థానాలు ఏకగ్రీవం కావడం సంతోషకరమని నాయకులు పేర్కొన్నారు. మిగిలిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తే గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కూటమి భాగస్వామ్య పార్టీల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు స్వర్ణకార సంఘం సన్మానం

రాయికల్ (వాయిస్ టుడే) రాయికల్ : తహసీల్దార్ కార్యాలయ తనిఖీకి వచ్చిన అదనపు కలెక్టర్ ను రాయికల్ మండల, పట్టణ స్వర్ణకార సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో మువ్వల సంజీవ చారి, తోగిటి గోపి, దురిశెట్టి రంగయ్య, ఆంజనేయులు, తుమ్మనపల్లి శ్రీనివాస్, తోగిటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం

బీజేపీ రాష్ట్ర నాయకులు,మక్తల్ నియోజకవర్గ MLC ఎన్నికల ఇంచార్జ్ డాక్టర్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి

మక్తల్ అక్టోబర్ 29 వాయిస్ టుడే ప్రతినిధి : కర్ణాటకలో ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠమని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకొని, ప్రజా సమస్యల పరిష్కారంపై కాంగ్రెస్ నాయకత్వం దృష్టి సారించాలని హితవు పలికారు. కర్ణాటకలో జరిగిన నాలుగు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో బీజేపీ మూడు స్థానాలు, ఎన్డీఏ మిత్రపక్షమైన జేడీఎస్ ఒక స్థానంలో విజయం సాధించాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని చాటి చెప్తున్నాయని వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయులు, పట్టభద్రుల వంటి విద్యావంతుల వర్గాలు తమ తీర్పు ద్వారా కాంగ్రెస్‌కు గట్టి గుణపాఠం చెప్పారని అన్నారు. ప్రధాని మోదీపై విమర్శలు చేయడం కంటే ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై కాంగ్రెస్ పార్టీ దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఫలితాలు ప్రజల అభిప్రాయానికి ప్రతిబింబమని, ప్రజల విశ్వాసాన్ని పొందేందుకు రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డాక్టర్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి పేర్కొన్నారు.

హైదరాబాద్ స్వీట్ షాపులపై దాడులు

దీపావళి పండుగ సమీపిస్తున్న వేళ హైదరాబాద్‌లోని పలు స్వీట్ షాపులు, తయారీ కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అపరిశుభ్ర వాతావరణంలో స్వీట్లు తయారు చేస్తున్నారని గుర్తించి... నగరంలో ఎంతో పేరున్న జి. పుల్లారెడ్డి స్వీట్స్ సహా పలు సంస్థలపై కఠిన చర్యలు తీసుకున్నారు. పుల్లారెడ్డి స్వీట్స్ ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌ను సస్పెండ్ చేశారు. టీజీ సేఫ్ (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్), పోలీసులతో కూడిన 13 బృందాలు జీహెచ్ఎంసీ పరిధిలోని 16 ప్రధాన స్వీట్ షాపులపై ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో మొత్తం రూ.16.86 లక్షల విలువైన 3,546 కిలోల కల్తీ, పాడైపోయిన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు 5 సంస్థల లైసెన్సులను సస్పెండ్ చేయగా, లైసెన్సులు లేకుండా నడుస్తున్న మరో 5 షాపులను మూసివేశారు. సనత్‌నగర్‌లోని పుల్లారెడ్డి స్వీట్స్ తయారీ యూనిట్‌లో కుళ్లిన కూరగాయలు, ఎలుకల వ్యర్థాలు, గడువు ముగిసిన పదార్థాలను గుర్తించిన అధికారులు నిర్ఘాంతపోయారు. వంటగది, శుభ్రపరిచే ప్రదేశాలు అత్యంత అపరిశుభ్రంగా ఉండటంతో లైసెన్సును తక్షణమే సస్పెండ్ చేశారు. ఇక్కడి నుంచే ఏకంగా రూ.15.03 లక్షల విలువైన 3,133 కిలోల ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. చార్మినార్‌లోని ఆగ్రా మిఠాయి ఘర్, వనస్థలిపురంలోని స్వీట్ వన్ రుచులు, ఫలక్‌నుమాలోని బాలాజీ శ్రీ కిషన్ మిఠాయి భండార్, కాటేదాన్‌లోని హిరాణి ఫుడ్స్ లైసెన్సులను కూడా సస్పెండ్ చేశారు.

పూడి గ్రామంలో వైకాపా ఎన్నికల ప్రచారం జోరు

శ్రీకాళహస్తి(వాయిస్ టుడే)అక్టోబర్ 29 : ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. వైకాపా అభ్యర్థులకు భారీ మెజారిటీ ఖాయం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని తొట్టంబేడు మండలం పూడి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైకాపా) ఎన్నికల ప్రచారం ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ అభ్యర్థి వాసు నాయుడు, ఎంపీటీసీ అభ్యర్థి కౌసల్యతో కలిసి నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.కూటమి ప్రభుత్వంపై నేతల విమర్శలు ఈ సందర్భంగా బియ్యపు మధుసూదన్ రెడ్డి, అంజూరు తారక శ్రీనివాసులు, జడ్పీటీసీ అభ్యర్థి వాసు నాయుడు మాట్లాడుతూ: రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన నామినేషన్ల ప్రక్రియలో కూటమి ప్రభుత్వం తమ పార్టీ నాయకులు, అభ్యర్థులను అనేక ఇబ్బందులకు గురిచేసిందని, ఈ పరిణామాలను ప్రజలు నిశితంగా గమనించారని ఆరోపించారు.ప్రస్తుతం జరుగుతున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వారు ధీమా వ్యక్తం చేశారు. తాము ప్రచారం నిర్వహిస్తున్న ప్రతి గ్రామంలోనూ ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఎదురవుతున్న సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తున్నారని పేర్కొన్నారు.వైకాపా అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి, రానున్న ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులకు అఖండ మెజారిటీ అందిస్తామని ప్రజలు స్వచ్ఛందంగా చెబుతున్నారని, ఇది ప్రజల్లో మార్పు పట్ల ఉన్న ఆకాంక్షకు నిదర్శనమని నాయకులు అన్నారు. ఓటర్లు వేసే ప్రతి అమూల్యమైన ఓటు మండల అభివృద్ధికి, మార్పునకు నాంది పలుకుతుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైకాపా జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా భవిష్యత్తులో తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావడానికి బలమైన పునాది ఏర్పడుతుందని వారు అభిప్రాయపడ్డారు. కావున, ఓటర్లు తమ అమూల్యమైన ఓటును వైకాపా అభ్యర్థులకు వేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

పంటచేనుల్లో పొలాస శాస్త్రవేత్తలు

రాయికల్(వాయిస్ టుడే) : రాయికల్ ఆలూరు లోని పంట పొలాలు, కూరగాయల తోటలను పొలస వ్యవసాయ విద్యాలయం శాస్త్ర వేత్తలు పరిశీలించారు. పసుపులో ఆకు మచ్చ తెగులను గమనించారు నివారణకు కార్బెండాజిమ్ ం మంకోజెబ్ 500గ్రా / లి ఎకరానికి పిచికారి చేయాలని సూచించారు. మొక్కజొన్నలో రబ్బరు పురుగు ఉధృతిని గమనించారు, నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 60 మి. లి ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. టమాటోలో వైరస్ తెగుళ్లను గమనించారు.తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 400 మి. లి ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో శాస్రవేత్తలు డా. కే. రాజేష్, డా టీ. ఎల్లగౌడ్ మరియు డా. వై. స్వాతి,సర్పంచ్ నల్లాల స్వామి,రైతులు ఆకుల నర్సారెడ్డి, ఆకుల లక్ష్మినారాయణ, మెక్కొండ రాంరెడ్డి, మెక్కొండ రాజకుమార్ , నల్లాల తిరుపతి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.